ముగిసిన ఖోఖో పోటీలు

కేంద్రీయ విద్యాలయాల రీజనల్ స్థాయి ఖోఖో పోటీలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం హోరాహోరీగా సాగాయి. బాలికల విభాగంలో తెలంగాణ రాష్ట్రం నల్గొండ జట్టు, బాలుర విభాగంలో ఖమ్మం జట్టు విజేతలుగా నిలిచాయి. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు. పోటీలలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని కేవీల నుంచి 16 బాలికలు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి.

7



తీరంలో సండడే సందడి



కొత్తపట్నం తీరం ఆదివారం పర్యాటకులతో కళకళలాడింది. పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో అనేక మంది కుటుంబ సమేతంగా తరలివచ్చారు. సముద్రంలోకి దిగి స్నానాలు చేశారు. చిన్నారులు కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. కొందరు అక్కడ ఏర్పాటు చేసిన గుర్రంపై స్వారీ చేస్తూ కనిపించారు. రైడింగ్ కోసం ఏర్పాటు చేసిన మినీ జీపును యువకులు నడిపి సరదా తీర్చుకున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఒంగోలు

డెయిరీ వీఆర్ఎస్ ఉద్యోగులకు
భారీ ఊరట

- రూ.1.20 కోట్ల పెండింగ్ జీతాలు విడుదల
- హయ్యర్ పెన్షన్ స్కీంలోకి 64 మంది అర్హత
- సాధారణం కన్నా మూడు రెట్లు అధిక పెన్షన్
- గత వైసీపీ ప్రభుత్వంలో డెయిరీ మూసివేత
- ఉద్యోగులను వీధుల్లోకి నెట్టిన వైనం
- ప్రస్తుతం మంత్రి స్వామి చొరవతో సమస్యలు పరిష్కారం



వీఆర్ఎస్ ఉద్యోగుల వినతిని స్వీకరిస్తున్న మంత్రి స్వామి (ఫైల్)

ఒంగోలు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డెయిరీలో పనిచేసి వీఆర్ఎస్ (స్వచ్ఛంద ఉద్యోగ విరమణ) తీసుకున్న ఉద్యోగులకు భారీ ఊరట లభించింది. వారికి పెండింగ్ ఉన్న వేతన బకాయిలు రూ.1.20 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. పీఎఫ్ బకాయిలను ఆ సంస్థకు జమ చేసింది. దీంతో ఉద్యోగులకు జీవిత కాలం హయ్యర్ పెన్షన్ ఏడాదికి సగటున లక్షా 20వేల వరకూ దక్కనుంది.

అమూల్ సేవలో తరిస్తూ ఒంగోలు డెయిరీని 2020 డిసెంబరులో అప్పటి వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. ఆ సమయంలో డెయిరీలో పనిచేస్తున్న శాశ్వత ఉద్యోగులు 68 మందిని బలవంతంగా వీఆర్ఎస్ కింద రిటైర్మెంట్ చేయించింది. అందుకు సంబంధించి రూ.13.29 కోట్లను ఉద్యోగుల వేతన, పీఎఫ్ బకాయిలు, ఇతర సెటిల్మెంట్ కింద పశుసంవర్ధకశాఖ ద్వారా ప్రభుత్వం 2022 నవంబరులో ఉత్తర్వులు ఇచ్చింది. అయితే సకాలంలో పూర్తిస్థాయిలో ఉద్యోగులకు చెల్లింపులు జరగలేదు. అందులో నెలకు రూ.40 లక్షల వంతున మూడు నెలలకు రూ.1.20 కోట్లు, ఐదు నెలలకు పీఎఫ్ బకాయిలకు సంబంధించి రూ.40 లక్షలు నిలిచిపోయాయి.

టీడీపీ ప్రభుత్వం రాకతో ఆశలు

వీఆర్ఎస్ తీసుకున్న డెయిరీ ఉద్యోగుల ప్రతినిధులు కాటూరి శ్రీను, యు.బ్రహ్మయ్య, శ్రీనివాసరావు, శేషారావు తదితరులు జనవరి 31న జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామిని కలిసి గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో చర్చించి డెయిరీలో వీఆర్ఎస్ తీసుకున్న ఉద్యోగులకు ఎలాంటి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

మంత్రి స్వామి ఆదేశాలతో కదలిక

మంత్రి స్వామి చొరవతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఉద్యోగులకు ఆగిపోయిన మూడు నెలల వేతన బకాయిలు రూ.1.20 కోట్లు ఇటీవల వారికి అందాయి. ఐదు నెలల పీఎఫ్ వాటా చెల్లింపులు రూ.40 లక్షలు సంస్థకు ఫెడరేషన్ అధికారులు జమ చేశారు. దీంతో 68 మంది ఉద్యోగుల్లో 64 మందికి హయ్యర్ పెన్షన్ స్కీంలో చేరే అవకాశం లభించింది. అంతకు ముందు ఉన్న ఈపీఎఫ్ స్కీం ప్రకారం ఈ తరహా ఉద్యోగులకు గరిష్ఠంగా రూ.3,500 నెలవారీ పెన్షన్ ఉండగా హయ్యర్ పెన్షన్ స్కీంలో అర్హత వస్తే కనిష్ఠంగా రూ.5,500, గరిష్ఠంగా రూ.15వేల మేర నెలనెలా పెన్షన్ వస్తోంది.

బయటపడుతున్న
రాజకీయ ప్రమేయం!

అమెరికా వెళ్లిన మాజీ ప్రజాప్రతినిధి

రేషన్ మాఫియా డాన్‌తో ఇప్పటికీ సన్నిహిత సంబంధాలు ఉన్న వైసీపీకి చెందిన మాజీ ప్రజాప్రతినిధిని విచారించాలని పోలీసులు భావించినట్లు తెలిసింది. అయితే అనూహ్యంగా ఆయన ఇటీవలే అమెరికాకు వెళ్లినట్లు సమాచారం. ఘటన అనంతరం వెళ్లారా? ముందు రోజుల్లో వెళ్లారా? అనేది తెలియాల్సి ఉంది.

వీరయ్య హత్య కేసులో సూత్రధారులకు
వైసీపీతో సంబంధాలు

- పోలీసుల విచారణలో ఆ పార్టీ ఎంపీపీ భర్త, మరో ఎంపీపీ
- అమెరికాకు వెళ్లిన మాజీ ప్రజాప్రతినిధి
- హంతకులు జిల్లా, పొరుగు జిల్లాల వారే
- కీలక ఆధారాలతో దూకుడు పెంచిన ఎస్పీ

టీడీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్యచౌదరి హత్యకేసు సూత్రధారుల్లో అత్యధికులు రాజకీయంగా వైసీపీతో సంబంధం ఉన్నవారేనని పోలీసులు గుర్తించారు. వారికి ఒకరిద్దరు వైసీపీయేతర వీరయ్య శత్రువులు కూడా తోడైనట్లు ప్రాథమికంగా ఒక అభిప్రాయానికి వచ్చారు. ఆవైపు కూడా దృష్టి సారించి విచారణ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వైసీపీకి చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధి హడావుడిగా అమెరికా వెళ్లారని పోలీసుల దృష్టికొచ్చినట్లు తెలిసింది. అదేసమయంలో వైసీపీకి చెందిన ఓ ఎంపీపీ భర్తను, ఆ పక్క మండలానికి చెందిన ఒక ఎంపీపీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. మరోవైపు జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారంలో మునిగి తేలుతున్న పలువురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. ఎస్పీ దామోదర్ స్వీయ దర్యాప్తులో భాగంగా కిందిస్థాయికి వెళ్లి అనేక ఆధారాలు సేకరించి దూకుడు పెంచారు.



వీరయ్య చౌదరి హత్య కేసు దర్యాప్తులో భాగంగా శనివారం బైక్‌పై వెళుతున్న ఎస్పీ దామోదర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

టీడీపీ నాయకుడు వీరయ్య హత్య కేసులో ఇప్పటికే నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు, వారికి పరిచయస్థుడైన ఒంగోలు వాసి సూత్రధారులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి హైదరాబాద్‌లో ఉంటున్న అమ్మనబ్రోలుకే చెందిన ఒక ప్రముఖ వ్యాపారి సహకరించినట్లు కూడా విచారణలో బయటపడింది. వారిలో ఒకరు రేషన్ మాఫియా డాన్ కాగా.. మరొకరికి లిక్కర్ వ్యాపారంతో, ఇంకొకరికి ఇసుక వ్యాపారంతో సంబంధాలున్నాయి. దీంతో వీరందరికీ ఉన్న రాజకీయ సంబంధాలపై పోలీసులు నిశిత పరిశీలన చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ వ్యాపారికి జిల్లాలోని పలువురు వైసీపీ నేతలతోపాటు నాగులుప్పలపాడు మండలం, అలాగే సంతనూతలపాడు నియోజకవర్గానికి చెందిన వైసీపీ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసులో సూత్రధారులుగా భావిస్తున్న వారిలో ఉప్పుగుండూరు, అమ్మనబ్రోలు గ్రామాలకు చెందిన వారితో కూడా హైదరాబాద్ వ్యాపారికి మంచి సంబంధాలు ఉన్నట్లు భావిస్తున్నారు. వీరిలో అటు హైదరాబాద్ వ్యాపారితోపాటు స్థానికంగా రేషన్ మాఫియా డాన్ కూడా వైసీపీ నాయకులతో చెట్టాపట్టాలేసుకుని తిరిగిన ఉదంతాలు వెల్లడైనట్లు తెలిసింది. ప్రధానంగా అప్పట్లో నియోజకవర్గ ముఖ్యప్రజాప్రతినిధిగా ఉన్న వారితో వీరికి మంచి సంబంధాలు ఉన్నట్లు గుర్తించారు. హైదరాబాద్‌లో ఉండే వ్యాపారి, రేషన్ మాఫియా డాన్ వైసీపీతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉండగా మరో సూత్రధారిగా భావిస్తున్న మద్యం వ్యాపారికి మాత్రం ఆ పార్టీతో సంబంధాలు లేవని గుర్తించారు.

వైసీపీ నాయకుల పాత్రపై ఆరా

వీరయ్య హత్య కేసులో వైసీపీ నాయకుల పాత్ర ఉందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. ఓ ఎంపీపీ భర్తను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆదివారం సాయంత్రం ప్రస్తుతం బాపట్ల జిల్లా పరిధిలో ఉన్న ఒక మండలపరిషత్ అధ్యక్షుడిని కూడా అదుపులోకి తీసుకుని విచారణ ప్రారంభించారు. సూత్రధారుల్లో ఒకరిగా ఉన్న అమ్మనబ్రోలు వాసి వైసీపీ కానప్పటికీ తెలుగుదేశంలో ఆయనకున్న సంబంధాలపైనా పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు.

రెండో వాహనాన్ని గుర్తించిన ఎస్పీ

ఎస్పీ దామోదర్ మోటారు సైకిల్‌పై ఒంగోలు సమీప ప్రాంతాలన్నీ గాలించి హంతకులు ఉపయోగించిన రెండో వాహనాన్ని కూడా ఒంగోలు- మంగమూరు మధ్య గుర్తించారు. సాక్షులను స్వయంగా విచారించి ఆతర్వాత హంతకులను గుర్తించే విషయంలో కీలక సమాచారాన్ని ఆయన రాబట్టినట్లు తెలిసింది. హత్య కేసులో రేషన్ మాఫియా పాత్ర అధికంగా ఉండటంతో గతంలో ఆయా నియోజకవర్గాల్లో రేషన్ బియ్యం వ్యాపారం చేసిన, ప్రస్తుతం చేస్తున్న ముఖ్యులందరినీ అదుపులోకి తీసుకుని విడివిడిగా విచారణ చేస్తున్నట్లు సమాచారం.



జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల పునర్విభజన ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. నాలుగు నెలలుగా ఇది నడుస్తూనే ఉంది. ప్రభుత్వం రోజుకో ఉత్తర్వు ఇస్తూ గందరగోళానికి గురిచేస్తోంది. తాజాగా టీచర్ల పునర్విభజనలో మళ్లీ మార్పులు చేసింది. యూపీ స్కూళ్లకు స్కూల్ అసిస్టెంట్లను కేటాయించేందుకు కమిషనర్ అంగీకరించారు. అయితే ఉర్దూ పాఠశాలలకు తెలుగు సెకండరీ గ్రేడ్ టీచర్లను కేటాయించడంతో ప్రక్రియ మళ్లీ మొదటికి వచ్చింది. - ఒంగోలు విద్య, ఆంధ్రజ్యోతి

7

నేటి నుంచి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

- ప్రైవేటు స్కూల్స్‌లో 25 శాతం సీట్లు



ఒంగోలులో ఆగస్టు 20 నుంచి సీపీఐ రాష్ట్రమహాసభలు

- పార్టీ శతజయంతి సందర్భంగా కార్యక్రమానికి ప్రాముఖ్యత
- రాష్ట్ర నాయకత్వాన్ని అందించడంలో చరిత్ర కలిగిన ప్రకాశం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యం

- కడప మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా జమున బదిలీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్ సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రిన్సిపాళ్లు, జీజీహెచ్‌ల సూపరింటెండెంట్‌ల బదిలీలు ఆదివారం జరిగాయి. కొందరికి ఉద్యోగోన్నతులు లభించాయి. ఇప్పటి వరకూ విశాఖపట్నం మెడికల్ కళాశాలలో ఎండోక్రైనాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను ఉద్యోగోన్నతిపై ఒంగోలుకు బదిలీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న డాక్టర్ టి.జమునకు కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా స్థానచలనం కల్పించారు.

కొనసాగుతున్న
కసరత్తు

టీచర్ల పునర్విభజనపై మళ్లీ మారిన నిబంధనలు

యూపీ స్కూళ్లకు ఎస్ఏ, ఎస్జీటీలు ● ఉర్దూ స్కూళ్లకు తెలుగు టీచర్లు

విద్యా సంస్కరణల్లో భాగంగా గత ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన 117 జీవోను ప్రస్తుత సర్కారు రద్దు చేసింది. దానికి ప్రత్యామ్నాయంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, టీచర్ల పునర్విభజనకు సంబంధించి జనవరిలో ఉత్తర్వులు జారీ చేసింది. అప్పటి నుంచి ఇది నడుస్తూనే ఉంది. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా 85 యూపీ స్కూళ్లను కొనసాగిస్తున్నారు. వీటికి మొదట స్కూల్ అసిస్టెంట్లను కేటాయించేందుకు పాఠశాల విద్య కమిషనర్ ససేమిరా అన్నారు. ఆ పాఠశాలలకు కేవలం సెకండరీ గ్రేడ్ టీచర్లను మాత్రమే కేటాయించారు.

యూపీలకు స్కూలు అసిస్టెంట్లు

దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీంతో డౌన్‌గ్రేడ్ చేసిన యూపీ స్కూళ్లలో మిగులుగా తేలిన స్కూలు అసిస్టెంట్లను అవసరమున్న హైస్కూళ్లకు, మోడల్ ప్రాథమిక పాఠశాలలకు సర్దుబాటు చేశారు. మిగిలిన వర్కింగ్ స్కూలు అసిస్టెంట్లను యూపీ స్కూళ్లకు కేటాయించాలని కమిషనర్ ఆదేశించారు. దీంతో యూపీ స్కూళ్లకు కూడా స్కూల్ అసిస్టెంట్లు రానున్నారు. డీఎస్సీలో ఖాళీ స్కూలు అసిస్టెంట్ పోస్టు ఒక్కటి కూడా పాఠశాలలకు చూపరు. స్కూలు అసిస్టెంట్లు అందుబాటులో లేని యూపీలకు సెకండరీ గ్రేడ్ టీచర్లనే కేటాయిస్తున్నారు. అందులో విద్యార్థి, ఉపాధ్యాయుడి నిష్పత్తిలో ఎటువంటి మార్పులు చేయకపోవడంతో మెజారిటీ యూపీ స్కూళ్లలో ఒకరిద్దరు టీచర్లు మాత్రమే మిగిలే పరిస్థితి నెలకొంది.

ఉర్దూ- తెలుగు అభ్యంతరాలు

జిల్లాలో ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు ఉర్దూ టీచర్లకు బదులుగా తెలుగు టీచర్లను నియమించడం విమర్శలకు దారి తీసింది. దీనిపై మండల విద్యాధికారులు అభ్యంతరాలు తెలపడంతో ఉర్దూ పాఠశాలల్లో టీచర్ల పునర్విభజన మళ్లీ మొదటికి వచ్చింది. ఒంగోలులోని కోటవీధిలో మౌలానా అబుల్‌కలాం అజాద్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో పది మంది లోపు విద్యార్థులు ఉర్దూ చదువుతున్నారు. అక్కడ ఇద్దరు ఉర్దూ ఎస్జీటీలు పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఈ పాఠశాలలో ఒక ఉర్దూ ఎస్జీటీని కొనసాగిస్తూ రెండో టీచర్‌ను మిగులుగా చూపించాలి. అయితే ఇద్దరు ఉర్దూ ఎస్జీటీలను మిగులుగా చూపించి ఒక తెలుగు ఎస్జీటీని కేటాయించారు. దీనిపై ఒంగోలు ఎంఈవో టి.కిషోర్‌బాబు ప్రభుత్వానికి అభ్యంతరం తెలిపారు. ఇలా మరికొన్ని పాఠశాలల నుంచి కూడా వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రక్రియ ఎప్పటికి పూర్తవుతుందో వేచి చూడాలి.

7

ఈకేవైసీపై నిర్లిప్తత

ప్రభుత్వం అవకాశం కల్పించినా వినియోగించుకోని కార్డుదారులు

- జిల్లాలో 1.22 లక్షల మంది పెండింగ్‌లోనే..
- అలాంటి వారికి వచ్చేనెల నుంచి రేషన్ బంద్



ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రేషన్ కార్డుదారులు ఈకేవైసీ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం గడువు పెంచినా ఆశించిన విధంగా స్పందించడం లేదు. కార్డుదారులు తప్పనిసరిగా రేషన్ డీలర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. గతనెలాఖరు వరకూ అందుకు అవకాశం ఇచ్చింది. సమయం తక్కువగా ఉండటంతో ఈనెల 30 వరకూ గడువు పొడిగించింది. అయినా చాలామంది ఆసక్తి చూపడం లేదు.

ప్రక్షాళనలో భాగంగానే..

రేషన్ పంపిణీలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటుండటంతో దానిని అరికట్టేందుకు ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. అందులో భాగంగా రేషన్ కార్డుదారుల సభ్యులంతా ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా ప్రజా పంపిణీ వ్యవస్థను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంది. మరోవైపు ఇప్పటి వరకు రేషన్ కార్డులు లేనివారికి, వాటిలో పేర్లు నమోదు, ఏమైనా తొలగింపులు ఉంటే చేపట్టేందుకు ముందుగానే ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుదారు లందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకునే విధంగా చర్యలు తీసుకుంది. అయితే ఆశించిన స్థాయిలో స్పందన లేదు. ఈనెలాఖరులోపు ఈకేవైసీ చేయించుకోకపోతే అటువంటి వారికి రేషన్ లబ్ధి చేకూరే పరిస్థితి లేకుండాపోతుంది.

జిల్లాలో 6,61,204 రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటి పరిధిలో 19,37,979 మంది సభ్యులు ఉన్నారు. వారిలో 2,06,064 మందికి ఈకేవైసీ లేదని ప్రభుత్వం గుర్తించింది. అలాంటి వారంతా తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించింది. మరోవైపు ఏప్రిల్ 1వతేదీ నుంచి జిల్లాలో రేషన్ పంపిణీ జరుగుతున్నందున మొబైల్ వాహనాల వద్ద కూడా ఈకేవైసీకి అవకాశం కల్పించింది. అయితే నెల వ్యవధిలో కేవలం 83,389 మంది మాత్రమే నమోదు చేయించుకున్నారు. ఇంకా జిల్లాలో 1,22,675 మంది కార్డుదారులు పెండింగ్‌లో ఉన్నారు.

నెలలో 83,389 మంది మాత్రమే నమోదు

కొప్పోలురోడ్డులో ప్రమాదకరంగా గుంత

● వాహనదారుల అవస్థలు



రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించి వెళుతున్న వాహనాలు

ఒంగోలు నుంచి కొప్పోలు వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డులోని హైవే ఫ్లైఓవర్ వంతెనకు పడమరవైపు ఇందిరకాలనీ ఎదురు నెల క్రితం తాగునీటి పైపులైన్ కోసం తవ్వి అనంతరం తారుతో రోడ్డును పునరుద్ధరించారు. అయితే పైపులైన్ కోసం తీసిన గుంతను సక్రమంగా పూడ్చకపోవడంతో రోడ్డు కుంగిపోయింది. వాహనదారులు దగ్గరకు వచ్చే వరకు గుర్తించ లేక పడిపోయి గాయాల పాలవుతున్నారు. సంబంధిత గుంతను తక్షణమే మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. - ఒంగోలు(రూరల్), ఆంధ్రజ్యోతి

క్రమబద్ధీకరణకు నోచుకోని 22ఏ భూములు

● తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో 22ఏలో చేరిన పట్టా భూములు ఏళ్ల తరబడి క్రమబద్ధీకరణకు నోచుకోక హక్కుదారులు అల్లాడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ పనులు జరగకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు 22ఏలో నుంచి తొలగిస్తామని రైతుల వద్ద లక్షలాది రూపాయల ముడుపులు తీసుకొని పనులు చేయకుండా వెళ్లిపోయారు. ఇప్పుడు ఏం చేయాలె పాలుపోక ఆ రైతులు అల్లాడుతున్నారు. వాస్తవంగా ఆ భూములు రికార్డుల ప్రకారం పట్టాభూములైనప్పటికీ అధికారులు ఉద్దేశపూర్వకంగా అనేక గ్రామాల్లో 22ఏ లో చేర్చారు. పలు గ్రామాల్లో కోర్టుల ద్వారా పట్టాలు పొంది రికార్డులు క్రమబద్ధీకరించుకొని కొందరు సాగు చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. అలాంటి భూములను కూడా 22ఏలో చేర్చారు. దర్శికి చెందిన కొంతమంది రైతుల పట్టాభూములను 22ఏలో చేర్చటమే కాక లంకోజనపల్లి రెవెన్యూలో కలిపారు. ఇక్కడి భూములను అక్కడి 22ఏ జాబితాలో ఎలా కలిపారో అర్థంకాలేదు. ఈ విషయాలను రైతులు గుర్తించి అధికారులు చేసిన తప్పిదాలపై మండిపడుతున్నారు. కొంతమంది రైతులు కోర్టులకు వెళ్లి 22ఏలో చేరిన భూములను పట్టాభూములుగా హక్కు కల్గేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ భూములను మాత్రం అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో క్రమబద్ధీకరించారు. మిగిలిన భూముల గురించి పట్టించుకోలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముడుపులు తీసుకున్న అధికారులు ఇప్పుడు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గట్టిగా ఒత్తిడి తెచ్చిన కొంతమంది రైతులకు తిరిగి డబ్బులు ఇచ్చారు. మరికొందరికి నేటికీ ఇంకా డబ్బులు ఇవ్వలేదు. తాము ఆ పనిచేస్తామని ఇంకా మాయమాటలు చెబుతున్నారు. ఏళ్ల తరబడి వేచి చూసిన రైతులు ఇక పనులు జరగవనే ఉద్దేశంతో కొంతమంది కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏలో చేరిన భూములను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించటంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను గుర్తించి రికార్డులు క్రమబద్ధీకరించి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మార్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి మార్కాపురంలోని అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కనిగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జి.రమేష్ మార్కాపురంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో నివాసముంటున్న రమేష్ భార్య అనూషతో కలిసి ఆదివారం మార్కాపురం వచ్చారు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వారిని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రమేష్, అనూషకు గాయాలయ్యాయి. వెంటనే 108లో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇవ్వాలి

పొదిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక టింబర్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విశ్వబ్రాహ్మణులు తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయి పదవుల్లో స్థానం కల్పించాల్సిందిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సీఎం, డిప్యూటీ సీఎంలకు మా తరఫున విన్నవించాలని నాయకులు కోరారు. వైసీపీ హయాంటల కూల్చేసిన ఆరామ క్షేత్రాన్ని తిరిగి నిర్మించాలన్నారు. త్వరలో 10వ తరగతిలో 500, ఇంటర్‌లో 850 మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు సామంతపూడి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మనందం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నుని వసంతోత్సవం



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం నాలుగో రోజు వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధా న అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవస్వామి మూలవిరాట్‌కు వసంతం చల్లి అనంతరం ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పసుపు, చందనం, సుగంధ భరిత ద్రవ్యాలు కలిపి భక్తులపై వసంతాలు చల్లారు. ఉభయదాతలుగా మద్దెల రంగారావు, సీతారావమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవ మూర్తులను నాలుగు మాడవీధులలో కనులపండువుగా నగరోత్సవంలో విహరించారు. ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, ఉత్సవ సేవా సంఘం అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, సభ్యులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

నేడు ఊంజల్ సేవ

చెన్నకేశవస్వామికి సోమవారం లక్ష్మీ చెన్నకేశవ వికాసతరంగిణి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

ఆర్థిక లావాదేవీలపై శిక్షణ

మద్దిపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడులోని వెలుగు కార్యాలయంలో ఆదివారం సమాఖ్య సంఘాల ఆర్థిక లావాదేవీలపై శిక్షణ కార్యక్రమాన్ని ఏపీఎం కె.సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డ్వాక్రా సంఘాల్లో జరిగే ఆర్థిక లావాదేవీలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు పి.శ్రావణి, ఎల్‌సీసీ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో యాప్ తిప్పలు!

● సక్రమంగా పనిచేయని సెల్‌ఫోన్లు
● సరుకుల పంపిణీకి కష్టాలు



పి.గుడిపాడులో పోషకాహారంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

సంతనూతలపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పోషకాహారం పంపిణీ పారదర్శకంగా ఉండేందుకు కేంద్రం నూతన విధివిధానాలకు శ్రీకారం చుట్టింది. ముఖ ఆధారిత ధృవీకరణ విధానం అమలు చేస్తున్నారు. సరుకుల అందించే విషయంలో సెల్‌ఫోన్ ద్వారా ముఖ ఆధారిత హాజరును నమోదు చేస్తున్నారు. ఈ సమయంలో యాప్ సక్రమంగా పనిచేయకపోవడం, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలు సరిగా లేక గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేందుకు రెండు, మూడు సార్లు అంగన్‌వాడీ కేంద్రాలకు రావాల్సివస్తోందని వాపోతున్నారు.

నమోదు కాకుంటే అంతే..

గర్భిణులు అంగన్‌వాడీ కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలి. వారి వివరాలను సిబ్బంది బాలసంజీవిని, పోషణ్ ట్రాకర్, మిల్క్ యాప్‌లలో నమోదు చేస్తారు. ఆ వివరాల ఆధారంగా వారికి పోషకాహార కిట్లను అందిస్తారు. ప్రతీ నెలా 15వ తేదీలోగా నమోదైన లబ్ధిదారులకు మాత్రమే తర్వాత నెల పోషకాహార కిట్లను అందజేస్తారు. యాప్ సమయానికి పనిచేయక 15వ తేదీ తర్వాత పేర్లు నమోదు చేస్తున్న వారికి పోషకాహారం అందడం లేదు. కాగా లబ్ధిదారులకు ముఖ ఆధారిత హాజరు నమోదుతో సరుకులను అందిస్తారు. గత ప్రభుత్వం నాసికరకమైన సెల్‌ఫోన్లు సిబ్బందికి అందజేసింది. ఇవి పనిచేయక అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సొంత ఫోన్లలో యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకున్నారు. దీనికి ప్రతీ నెలా ప్రభుత్వం ఇచ్చే 2జీబీ డేటా సరిపోవడం లేదని వాపోతున్నారు.

నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు

మొత్తం అంగన్‌వాడీ కేంద్రాలు	- 286
సేవలందుకుంటున్న బాలింతలు	- 1,119
గర్భిణులు	- 1172
0-3 ఏళ్ల లోపు చిన్నారులు	- 1101
-3-6 ఏళ్ల లోపు చిన్నారులు	- 4450

సరుకుల వివరాలు..

బాలింతలకు ప్రతి నెలా రాగిపిండి 2కిలోలు, అటుకులు కిలో, బెల్లం పావుకిలో, ఎండు ఖర్జూరం, చిక్కీలతో పాటుగా బియ్యం మూడు కిలోలు, కందిపప్పు కిలో, అరలీటరు నూనెను పౌరసరఫరాలశాఖ నుంచి అందిస్తున్నారు. ఏప్రిల్ నెలకు సంబంధించి ఇంకా లబ్ధిదారులకు కిట్లు అందాల్సి ఉంది. మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాలు ఉండగా మొత్తం 286 అంగనవాడీ కేంద్రాలు ఉన్నాయి.

సమస్యలను పరిష్కరిస్తున్నాం

అంగన్‌వాడీ కేంద్రాల్లో యాప్‌ల నిర్వహణపై వస్తున్న సమస్యలను పరిష్కరిస్తున్నాం. నియోజకవర్గంలో 80 శాతం సరుకుల పంపిణీ పూర్తి చేశాం. మిగిలిన వారికి ఈనెలాఖరులోగా అందేటట్లు చూస్తాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు మొబైల్ సమస్యపై కూడా ఉన్నతాధికారులకు నివేదించాం. త్వరలోనే నూతన మొబైల్స్ వస్తాయి. గ్రామాల్లో ఇంటర్నెట్, టెక్నికల్ సమస్యలతో యాప్‌లో వివరాల నమోదులో ఇబ్బందులు వస్తున్నాయి. ఈ విషయం వాస్తవమే. బాలసంజీవిని యాప్‌లో ప్రభుత్వం మార్పులు చేసింది. దీంతో అక్కడక్కడా సమస్యలు వస్తున్నట్లు సిబ్బంది చెబుతున్నారు. అన్నింటికి పూర్తిస్థాయిలో పరిష్కారానికి ప్రభుత్వం సిద్ధం చేస్తోంది.

- ఇవాంజిలిన్, సీడీపీవో

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

● మంత్రి స్వామికి రైతు సంఘాల వినతి



మంత్రి స్వామికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘాల నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు చేసిన బర్లీ పొగాకు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. తూర్పునాయుడుపాలెంలో ఆదివారం రైతు సంఘాల నాయకులు మంత్రి డాక్టర్ స్వామిని కలిసి సమస్యను వివరించారు. గత ఏడాది బర్లీ పొగాకు ధరలు ఉండటంతో ఈ ఏడాది కూడా ధరలు బాగా ఉంటాయని కంపెనీ ప్రతినిధులు ప్రోత్సహించడంతో రైతులు విస్తారంగా సాగు చేశారన్నారు. అయితే ఈ పంటను 90శాతం మంది కౌలు రైతులే సాగు చేశారని తెలిపారు. పంట చేతికి వచ్చి అమ్ముకునే సమయం వచ్చే సరికి కంపెనీల ఏజెంట్లు పొగాకు కొనుగోలు చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్కువధరకు కొనుగోలు చేయాలని చూస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. బర్లీ పొగాకుకు గత సంవత్సరం ఇచ్చిన విధంగా టన్ను రూ.18వేలకు కొనిపించాలని, కంపెనీలు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బర్లీ పొగాకును బోర్డు పరిధిలో చేర్చే విధంగా చూడాలనిమంత్రిని కోరారు. కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, కొల్లా రాజమోహన్, జయంతిబాబు, కె.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి పాల్గొన్నారు.

విద్యాశాఖలో గందరగోళ పరిస్థితులు

● ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పునర్‌వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల పునర్విభజనలో అధికారులు రోజుకోక ప్రతిపాదన, పూటకోక సవరణతో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేది ఒకరకంగా, కార్యచరణ మరోలా ఉండటం శోచనీయమన్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని గందరగోళ పరిస్థితులను చక్కదిద్దాలని కోరారు. రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్‌కు బదులుగా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటు చేసి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, జిల్లా ప్రధానకార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మాలకొండయ్య, ఆదినారాయణ, దాసరి శ్రీనివాసులు, కడియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎన్నిక

● ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులు



ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఒంగోలు తాలూకా యూనిట్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఎన్నికలకు ఎన్నికల అధికారిగా షేక్ మసూద్‌ఆలీ, సహాయ ఎన్నికల అధికారిగా శ్రీనివాస్‌యాదవ్ వ్యవహరించారు. సంఘం ఒంగోలు తాలూకా అధ్యక్షుడుగా అనుమాల సురేష్, కార్యదర్శిగా కె.శ్రీదేవి, కోశాధికారి జి.వెంకట్రామిరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ప్రమిద, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్.వనజ, ఉపాధ్యక్షులుగా ఆర్.శ్రీనివాసరెడ్డి, కె.అంకబాబు, జె.చంద్రశేఖర్, షేక్ కరీముల్లా, ఎంవీ.బాబురావు, డి.రాజ్యలక్ష్మి, బి.గౌరీ. ఆర్‌సుధాకర్, ఎస్‌కే.జోహార్‌వలి, జాయింట్‌సెక్రటరీలుగా కె.ప్రసన్న, ఎ.హరిబాబు, కె.సందీప్, కె.ప్రతిమ, జి.సుజాత, ఎం. సునీత, డి.మాచిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంఘ సభ్యులు ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చూడాలన్నారు. జిల్లా సంఘం అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను పురస్కరించుకుని గుంటూరులోని లాం ఫాం ఆడిటోరియంలో ఈ నెల 29, 30వ తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈ ఉత్సవాల్లో అధికసంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి

కనిగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నీటిగుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం మండలంలోని బూతంవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమలదిన్నె చిన్నా (13) మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వటంతో పాటు ఆదివారం కావటంతో తన తోటి స్నేహితులతో కలసి గ్రామ సమీపాన ఉన్న జగనన్న కాలనీ సమీపంలో నీటిగుంతల్లో ఈత కొట్టేందుకు వెళ్ళాడు. ఈక్రమంలో చిన్నా గట్టుపై నుంచి ఒక్క ఉదుటున గుంతలో ఉన్న నీటిలోకి దూకాడు. మిగతా స్నేహితులు కూడా ఈత కొట్టేందుకు ఆలోచన చేస్తూ గట్టుపై ఉన్నారు. గుంతలోకి దూకిన చిన్నా ఎంతకూ పైకిరాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతూ గ్రామంలో పొగాకు బ్యారన్ వద్ద కట్టలు కడుతున్న మృతుడు తల్లికి జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని గుంతలో దిగి చూడగా కాళ్ళుపైకి ఉండి తల నీటి ఊబిలో చొచ్చుకుని ఉంది. వెంటనే కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లితండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు (చిన్నా), కుమార్తె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై తమకు సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

1 నుంచి 'లార్డ్‌కృష్ణ'లో షటిల్ సమ్మర్ క్యాంప్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని లార్డ్‌కృష్ణ షటిల్ బ్యాడ్మింటన్ అకాడమీలో మే 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండర్ ప్రెసిడెంట్ అద్దంకి మురళీకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 7-30 గంటల వరకు, 9 నుంచి 10-30 వరకు, సాయంత్రం 5-30 నుంచి 7-30 వరకు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో బాల, బాలికలకు శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి గల వారు తమ పేర్లను సెల్: 9398260109, 8328298418 ద్వారా సంప్రదించాలని కోరారు.

పేద ముస్లింలకు అందని వక్ఫ్ ఆస్తులను జాతీయం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం సమాజానికి ఎందుకు ఉపయోగపడని వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేయాలని ముస్లిం జాగరణ్ మంచ్ రాష్ట్ర నాయకుడు షేక్ మహ్మద్‌బుజ్జి డిమాండ్ చేశారు ఆదివారం ఒంగోలు నగరం ఇస్లాంపేటలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుపేద ముస్లింలకు ఉపయోగపడాల్సిన వక్ఫ్ భూములు కొంతమంది ముస్లిం మతపెద్దల చేతుల్లోకి వెళ్ళిపోయాయని ఆరోపించారు. ముతవల్లీలు వక్ఫ్ ఆస్తులను అందినకాడికి దోచుకొని అమ్ముకుంటున్నారని, అందువల్ల వక్ఫ్ భూములను దేశ ప్రజలకు అంకితం చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా నిరుపేద ముస్లింలు వక్ఫ్ ఆస్తులను అనుభవించడం లేదని, మతపెద్దల ద్వారానే అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడంపై నిరుపేద ముస్లిం అభినందిస్తున్నారని ఆయన తెలిపారు. నిరుపేద ముస్లింల వైద్య, విద్య కోసం, వారి అభివృద్ధి కోసం ఏమాత్రం ఉపయోగపడని వక్ఫ్ ఆస్తులను దేశ ప్రజల ఆస్తిగా ప్రకటించి జాతికి అంకితం చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు జాగరణ్‌మంచ్ నాయకులు పాల్గొన్నారు.

30న మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీ ఉదయం 10.30గంటలకు మండల సర్వ సభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో డీవీఎస్.ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వాకా అరుణ అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

సంతనూతలపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మత్స్యకార కుటుంబాలకు చేపల వేట నిషేధ సమయంలో ఇచ్చే భృతిని రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇవ్వడంపై రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకాస్వాములు ఆదివారం ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. ఉగ్రవాద నిర్మూలనకు కేంద్రానికి రాష్ట్రం తరుపునా మద్దతు ఇవ్వడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వేసవి శిక్షణ తరగతులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు గ్రంథాలయంలో ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు ఉచితంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ అధికారి కె.సత్యనారాయణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 6 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ తల్లిదండ్రులతో స్థానిక గ్రంథాలయంలో సంప్రదించాలని కోరారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

సంతనూతలపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం వాసవీక్లబ్, మహిళా క్లబ్ పర్యవేక్షణలో వాసవీ క్లబ్ జిల్లా ప్రతినిధి జీఎల్.ప్రసాదరావు, సులోచనల ఆధ్వర్యంలో మజ్జిగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన యూటీఎఫ్ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న శిక్షకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ నాయకులు, కార్యకర్తలకు రెండు రోజుల పాటు ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, ఎస్.రవి, ఎన్.శివకోటేశ్వరరావు, ఎన్.చిన్నస్వామి, కె.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, షేక్ అబ్దుల్‌హై, ఉమామహేశ్వరి, వెంకటేశ్వరరెడ్డి, జి.శేషయ్య పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ర్యాలీ



గాంధీనగర్‌లో కొవ్వొత్తులతో నిరసన

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడులను నిరసిస్తూ ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్‌లో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి షేక్ పీరు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడుల్లో 28 మంది పర్యాటకులు మృతి చెందడం బాధకరమన్నారు. ఇటువంటి దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు టి.మహేష్, రావూరి శ్రీనివాసరావు, సురేష్, గురవయ్య, దాసు, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణపై రౌండ్‌టేబుల్ సమావేశం

మద్దిపాడు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణలను కేంద్రం ఉపసంహరించుకోవాలని ఆవాజ్ రాష్ట్ర నాయకుడు యాసిన్ డిమాండ్ చేశారు. మద్దిపాడులో మసీద్‌లో బేగ్ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలపై చర్చించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఉబ్బా ఆదిలక్ష్మి, హుస్సేన్, సుభానీ, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న వసంతరావు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా వసంతరావు మాట్లాడుతూ ఎస్సీలను వర్గీకరించే విధానాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాలలను అణిచివేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా ఎస్సీ వర్గీకరణను చేపట్టిందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

మద్దిపాడు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని ఎస్ఐ బి.శివరామయ్య కోరారు. ఆదివారం మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ శివరామయ్య మాట్లాడుతూ జాతీయ రహదారిలో సీతా రామపురం కొష్టాలు దగ్గర, ఇండస్ట్రీయల్ గ్రోత్‌సెంటర్, వెల్లంపల్లి బ్రిడ్జి వద్ద, రాచవారిపాలెం రోడ్డు దగ్గర ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వాహనదారులు ఆయా ప్రాంతాల్లో వాహనదారులు జాగ్రత్త పాటించాలని చెప్పారు. జాతీయ రహదారిలో రాంగ్ రూటులో ప్రయాణించి ప్రమాదాల బారిన పడవద్దని, హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటోడ్రైవర్లు నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, వాహనదారులు పాల్గొన్నారు.


ప్రథమ స్థానం సాధించిన నల్గొండ బాలికల జట్టు

ముగిసిన ఖోఖో

- విజేతలుగా నల్గొండ, ఖమ్మం జట్లు
- వేర్వేరుగా పాల్గొన్న బాలికల, బాలుర టీంలు
- ఒంగోలు కేంద్రీయ విద్యాలయంలో రీజనల్ పోటీల నిర్వహణ

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కేంద్రీయ విద్యాలయ రీజనల్ ఖోఖో పోటీలలో విజేతలుగా నల్గొండ బాలికలు, ఖమ్మం బాలుర జట్లు ప్రథమ స్థానంలో నిలిచాయి. వివరాల్లోకెళితే... ఈనెల 24వ తేదీ నుంచి ఒంగోలులోని కేంద్రీయ విద్యాలయలో నిర్వహించిన వార్షిక క్రీడా పోటీలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ పోటీలలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వివిధ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలకు చెందిన 16 బాలికల జట్లు, 13 బాలుర జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో నల్గొండ కేంద్రీయ విద్యాలయ జట్టు ప్రథమ స్థానంలో, ఖమ్మం కేవీ జట్టు ద్వితీయ స్థానం, జిల్లాకు చెందిన రాజంపల్లి కేవీ జట్టు తృతీయ స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో ఖమ్మం కేవీ జట్టు ప్రథమ స్థానంలో, కాంచన్ బాగ్ కేవీ జట్టు ద్వితీయ స్థానం, బార్కాస్ సీఆర్‌పీఎఫ్ కేవీ జట్టు తృతీయ స్థానంలో విజయం సాధిచాయి. ఈ సందర్భంగా విద్యాలయ ప్రిన్సిపాల్ మనీష్ కుమార్ అధ్యక్షతన జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి రిమ్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏ శ్రీదేవి, కేవీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ బీ సూర్యప్రకాశరావు ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయులు అతిష్, పాఠశాల అధ్యాపక సిబ్బంది హఫీజ్, ఎంఎస్.రావు, రాజేష్, షాహిదా, కొండయ్య, బాషా గులాబ్ హాజరయ్యారు.


ప్రథమ స్థానం సాధించిన ఖమ్మం బాలుర జట్టు



పాయింట్ కోసం డైవింగ్ చేస్తున్న క్రీడాకారులు



షటిల్ విజేత విజయవాడ

- ద్వితీయ స్థానంలో రేపల్లె
- ముగిసిన రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలతో నిర్వాహకులు


పాయింట్ కొడుతున్న క్రీడాకారుడు

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుమ్మడి పవన్‌కుమార్ మెమోరియల్ రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో ఈనెల 26, 27 తేదీలలో జరిగిన పోటీలలో పురుషుల విభాగం ఇన్విటేషన్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు బెంగళూరుకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విజయవాడకు చెందిన హిమదీప్-వంశీలు ప్రథమస్థానంలో నిలవగా, రేపల్లె జట్టు హేమంత్-మునీర్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మూడోస్థానం నెల్లూరు కైవసం చేసుకోగా, నాల్గో స్థానం విజయవాడ దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు పీడీబీఏ జిల్లా కార్యదర్శి పావులూరి విజయ్‌కృష్ణ, కొమ్మినేని లక్ష్మణ్, యలవర్తి త్రిశంకర్‌రావు, యలవర్తి మల్లేశ్వరరావు, క్లబ్ ఉపాధ్యక్షులు ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి డాక్టర్ గుండవరపు రాఘవ విజేతలను బహుమతి ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి రూ.25వేలు, ద్వితీయ బహుమతి రూ.15వేలు, తృతీయ బహుమతి రూ.12వేలు, నాల్గవ బహుమతి రూ.10వేలు అందజేశారు.

నేటి నుంచి ఉచిత ప్రవేశాలకు దరఖాస్తులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉచితవిద్యాహక్కు చట్ట ప్రకారం జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో 25శాతం ఉచిత ప్రవేశాలకు సోమవారం నుంచి మే 15 వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. 1వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి. ఉచితప్రవేశాలకు అనాథపిల్లలు, హెచ్‌ఐవీ బాధితుల పిల్లలు, దివ్యాంగులకు ఐదుశాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 4శాతం, బలహీన వర్గాలకు ఆరుశాతం కేటాయించారు. అర్హులైన పిల్లలకు లాటరీ పద్ధతిలో సీట్లు కేటాయిస్తారు, సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నెంబరు 18004 258599ను సంప్రదించాలి. అడ్మిషన్ కోరే విద్యార్థుల తల్లిదండ్రులు ఆధార్, రేషన్, ఓటరు గుర్తింపు కార్డు, పాస్‌పోర్టు, కరెంటు బిల్లు, బియ్యంకార్డు, అడ్రసుకు తహసీల్దార ధృవీకరణ, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సర్టిఫికెట్, పిల్లల వయస్సు ధ్రువీకరణ పత్రం సమరిపంచాలని ఆయన కోరారు.

పొలం విషయంలో ఘర్షణ

టీడీపీ వర్గీయులపై సర్పంచ్ కుటుంబ సభ్యుల దాడి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో పొలం విషయంలో ఘర్షణ జరిగింది. టీడీపీ వర్గీయులపై వైసీపీ సర్పంచ్ కుటుంబ సభ్యులు కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఘర్షణలో టీడీపీ వర్గీయులు పోరెడ్డి ఓబులరెడ్డి, అల్లూరమ్మ తెలిపిన వివరాల ప్రకారం బోడపాడు గ్రామ వైసీపీ సర్పంచ్ కుటుంబ సభ్యులు వచ్చి గ్రామంలోని తమ ఇంటి వద్ద ఉండగా, తమతో గొడవ పెట్టుకుని కర్రలతో, క్రికెట్ బ్యాట్‌తో విచక్షణారహితంగా దాడి చేసి గాయపరిచారని తెలిపారు. తమ భూమిని అక్రమంగా ఆన్‌లైన్ నమోదు చేసుకుంటున్నారని, విచారించి తమకు న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులకు గ్రామ సర్పంచ్‌పై ఫిర్యాదు చేస్తే తమపై దాడి చేశారని తెలిపారు. గాయలైన వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఒంగోలులో ఆగస్టు 20 నుంచి
సీపీఐ రాష్ట్రమహాసభలు

- పార్టీ శతజయంతి సందర్భంగా కార్యక్రమానికి ప్రాముఖ్యత
- రాష్ట్రనాయకత్వాన్ని అందించడంలో చరిత్ర కలిగిన ప్రకాశం
- సీపీఐ రాష్ట్రకార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ, పక్కన నల్లూరి వెంకటేశ్వర్లు, వెంకయ్య, రవీంద్రనాథ్, నారాయణ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఆగస్టు 20నుంచి 24వ తేదీ వరకు సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ చెప్పారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభల ఆహ్వాన కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో రామకృష్ణ మాట్లాడుతూ శతజయంతి సందర్భంగా ఒంగోలులో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందన్నారు. రాష్ట్రానికి అత్యధిక నాయకత్వాన్ని అందించిన జిల్లా ప్రకాశం అని కొనియాడారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి బీవీ రాఘవులు, అఖిల భారత కిసాన్‌సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకయ్య, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటేశ్వరరావులు తదితరులు ప్రకాశం జిల్లావారేనని చెప్పారు. 92 వసంతాల నల్లూరి వెంకటేశ్వర్లు నాయకత్వంలో పార్టీ వందేళ్ల వేడుకలలో ఒంగోలులో మహాసభలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. జిల్లాలోని అన్నివర్గాల ప్రజలు సహాయ సహకారాలను అందించాలని కోరారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశం సంక్షోభంలో ఉందన్నారు. దేశంలో ఒడిదొడుకులున్నా, యుద్ధాలు జరిగినా అన్నింటినీ తట్టుకొని నిలబడి అభివృద్ధి బాటలో పయనిస్తుందని చెప్పారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో పారదర్శకత లోపించిందన్నారు.ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో నెట్టారని విమర్శించారు. వచ్చే నెల 2న అమరావతి పునఃశంకుస్థాపనకు ప్రధాని వస్తున్నారని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు అందిస్తుందని గతంలో మోదీ ప్రకటించారని, దానిని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గోదావరి నుంచి బరంచర్ల ప్రాజెక్టుకు మరో రూ.80 కోట్లు అప్పులు తెచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని ఆరోపించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ ఐదు రోజుల పాటు నిర్వహించే మహాసభలలో ప్రతిరోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. 26 జిల్లాల నుంచి వెయ్యి మంది కళాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్, అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకయ్య, ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు కేశరత్‌బాబు, సీపీఐ సీనియర్ నేత నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. సీనియర్ జర్నలిస్ట్ బేతాళ శ్రీనివాసరావు ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ రాష్ట్రమహాసభలకు తమ కుటుంబం నుంచి ఒక నెల జీతం మూడు లక్షల రూపాయలు అందించనున్నట్లు తెలిపారు.

మహాసభల కమిటీ ఎన్నిక

ఒంగోలులో జరగనున్న సీపీఐ మహాసభల ఆహ్వాన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ రాష్ట్ర సీనియర్ నాయకులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా పీజే చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా సీపీఐ జిల్లాకార్యదర్శి ఎంఎల్ నారాయణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఆర్. వెంకట్రావు, కోశాధికారిగా కొత్తకోట వెంకటేశ్వర్లుతో ఆహ్వాన కమిటీ ఎన్నికైంది. ప్యాట్రన్‌గా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, మహాటీవీ అధినేత మారెళ్ల వంశీకృష్ణ, ప్రముఖ సినీగాయకుడు వందేమాతరం శ్రీనివాస్, నటులు మాదాల రవి, సినీ డైరెక్టర్ బాబ్జి, మద్దినేని రమేష్, గడ్డం కోటేశ్వరరావు, ఎన్.అంజయ్య, సిహెచ్ కోటేశ్వరరావు, రావుల వెంకయ్యతో పాటు పలువురిని ఎన్నుకున్నారు.

మద్యం మత్తులో పరస్పర దాడులు

- ఒకరికి ఎడమ చెవివైపు కత్తిపోటు
- పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలింపు


అపస్మారక స్థితిలో శ్రీకాంత్

చీరాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మద్యం మత్తులో బంధువులు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో ఒకరికి ఎడమ చెవివైపు కత్తి పోటు దిగింది. అందిన వివరాల ప్రకారం... స్థానిక రామనగర్‌కు చెందిన చౌటుపల్లి శ్రీకాంత్, శ్రీరామ్ ప్రశాంత్‌లు బంధువులు. ఇద్దరు రాడ్ బెండింగ్ పని చేస్తున్నారు. వీరి మధ్య కొంత కాలంగా చిన్నపాటి వివాదాలు ఉన్నాయి. ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు మద్యం మత్తులో దాడులకు తెగబడ్డారు. ఈ క్రమంలో ప్రశాంత్ వరుసకు మామ అయిన శ్రీకాంత్ ఎడమ చెవి వైపు కత్తితో పొడిచాడు. దీంతో నాలుగు అంగుళాలు లోతులో గాయమైంది. రక్తం అధికంగా పోవడంతో అపస్మారక స్థితికి చేరాడు. స్థానికులు వెంటనే బాధితుడు శ్రీకాంత్‌ను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమచికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం గుంటూరుకు తరలించారు. అలాగే స్వల్ప రక్తగాయాలతో ప్రశాంత్ కూడా చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కల్పవృక్ష వాహనంపై వేంకటేశ్వరుడు



కంభం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కంభంలో వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం రాత్రి వేంకటేశ్వర స్వామి కల్పవృక్ష వాహనంపై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఊరేగింపులో కోలాట ప్రదర్శన అలరించింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకొని తరించారు.

ట్రెజరీ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక


అసోసియేషన్ జిల్లానూతన కార్యవర్గంతో ఎన్జీవో నేతలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ట్రెజరీ కార్యాలయ ఆవరణలో ఆదివారం నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా పి.కిరణ్ కుమార్, సహాయ ఎన్నికల అధికారిగా సీహెచ్ విజయకృష్ణ, పరిశీలకులుగా డి.రమణారెడ్డిలు వ్యవహరించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్‌వీ కృష్ణ(మార్కాపురం), కార్యదర్శిగా పి. అంకబాబు(ఒంగోలు), సహాధ్యక్షులుగా పీవీఎల్‌ఎన్ రవికుమార్(గిద్దలూరు)లు ఎన్నికయ్యారు. మహిళా ఉపాధ్యక్షురాలుగా కె. లావణ్య(ఒంగోలు), బి. అక్కేశ్వరరావు(ఒంగోలు), కె. కరీముల్లా(పొదిలి), కె. వెంకటేశ్వర్లు(మార్టూరు), మహిళా సంయుక్త కార్యదర్శులుగా పి.హేమలత(మార్కాపురం), కె. ప్రసాద్(కనిగిరి), డి.అనిల్(వైపాలెం), కోశాధికారిగా కె.రామకృష్ణ(ఒంగోలు)లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సీహెచ్ ఫణీంద్ర(కందుకూరు), ఐ. కిషోర్‌బాబు(ఒంగోలు)లు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం అనంతరం ప్రమాణస్వీకారం అట్టహాసంగా నిర్వహించారు. నూతన కార్యవర్గ సభ్యులను ఏపీఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే శరత్‌బాబు, ఆర్‌సీహెచ్ కృష్ణారెడ్డిలు అభినందించారు.

పందిళ్లమ్మతల్లి ఆలయంలో అర్ధరాత్రి చోరీ

- అమ్మవారి ముక్కు పుడక, వెండి కళ్లు, 15 చీరలు, నగదు అపహరణ


పందిళ్లమ్మతల్లి ఆలయం

పందిళ్లపల్లి(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం పందిళ్లపల్లి గ్రామ శివారులోని పందిళ్లమ్మతల్లి ఆలయంలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆలయంలో లోపలి వైపున వేసి ఉన్న తాళాలు పగలకొట్టి అమ్మవారి వెండి ముక్కు పుడక, వెండి కళ్లు, 15 చీరలు, హుండీలోని సుమారు రూ.50 వేలు నగదు అపహరించారు. ఆలయ అర్చకులు కంచర్ల భిక్షాలు, కమిటి ప్రతినిధులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న డీఎస్పీ ఎండి మొయిన్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీం సహాయంతో ఆధారాలు, ఫింగర్ ప్రింట్‌లు సేకరించారు. అయితే నగదుతో పాటు హుండీ కూడా అపహరించడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

- మృతుల్లో ఒకరు మైనంపాడు విద్యార్థి

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామ శివారు కామారెడ్డి-సిరిసిల్ల రహదారిపై ఆదివారం ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో సంతనూతలపాడు మండలం మైనంపాడు గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి తన్నీరు మహేశ్‌బాబు(16), సంటరుపాడు గ్రామానికి చెందిన దినసరి కూలీ కుంచెర్ల మధు(34)లు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు.. మైనంపాడు గ్రామానికి చెందిన తన్నీరు కుమారి-శివ దంపతులు తమ ఇద్దరు కొడుకులు శ్రీనివాస్, మహేశ్‌బాబులతో కలిసి కొన్నేళ్ల క్రితం ఎల్లారెడ్డిపేట వలసవచ్చి భవన నిర్మాణ పనులు చేసేవారు. మూడేళ్ల క్రితం హైదరాబాద్‌కు వెళ్లి అక్కడే పనులు చేస్తూ జీవిస్తున్నారు. చిన్నకొడుకు మహేశ్‌బాబు పొదిలిలో సంక్షేమ వసతిగృహంలో ఉంటూ ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల పరీక్షలు ముగియడంతో అతనికి పరిచయం ఉన్న మధుతో కలిసి ఎల్లారెడ్డిపేటలోని బంధువుల ఇంటికి వచ్చారు. ఇద్దరు కలిసి బైక్‌పై సిరిసిల్ల వైపు వెళుతుండగా కారు ఢీకొట్టింది. ఇద్దరూ చనిపోయారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

పెద్దయాచవరంలో తాగునీటికి కటకట

- బైకులపై నీటిని తెచ్చుకుంటున్న స్థానికులు
- ట్యాంకర్‌ల ద్వారా సరఫరా చేయాలని వినతి

మార్కాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : తాగు నీటి కోసం మండలంలోని పెద్ద యాచవరం గ్రామస్థులు కటకటలాడుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో గ్రామంలో ఉన్న బోర్లు అధిక శాతం నీరు లేక ఒట్టి పోయాయి. దీంతో గ్రామంలో నీటి కష్టాలు మొదలయ్యాయి. నీటి కోసం గ్రామ శివారులో ఉన్న సింగిల్ ‌ఫేస్ మోటార్ ద్వారా అరకొరగా వచ్చే నీటి కోసం వేచి ఉండి నీటిని బైకులపై, తోపుడు బండ్లపై, నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు వాపోతున్నారు. వీధులలో ఉన్న ఇళ్ళ మధ్య ఉన్న కొళాయిలకు నీరు రాకపోతుండడంతో గ్రామ శివారులో ఉన్న బోరులో నీరు తెచ్చుకునేందుకు ఇంట్లో వారు పనులు మానుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. గ్రామానికి సాగర్ నీటి సరఫరా సౌకర్యం ఉన్నప్పటికీ నీరు సక్రమంగా సరఫరా కావడంలేదని తెలిపారు. పదిరోజులకు ఒకసారి కూడా సాగర్ నీటి సరఫరా చేయకపోవడంతో నీటి కోసం కష్టాలు తప్పడంలేదని వాపోయారు. అసలే వేసవి కాలం కావడంతో పశువులకు కూడా పొలాల్లో నీరు దొరకక పోవడంతో నీరు అధికంగా ఖర్చవుతున్నాయని తెలిపారు. గ్రామంలో కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటి సరఫరా చేయక పోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సంబందిత అధికారులు, ప్రజా ప్రతినిధులు నీటి సమస్యను గుర్తించి పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ఊరి బయట ఉన్న బోరు వద్ద బిందెలతో నీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు



భూగర్భ జలాలు అడుగంట డంతో ఒట్టిపోయిన బోరు



నీరు రాకపోవడంతో నిరుపయోగంగా ఉన్న మినీ ట్యాంక్

ట్యాంకర్‌లతో సరఫరా చేయాలి



గ్రామంలో తాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నాం. ట్యాంకర్‌ల ద్వారా నీటిని సరఫరా చేసి సమస్యను తీర్చాలి. ప్రతి రోజు బైకులపై సుమారు గంట పాటు ఇంటి అవసరాల కోసం నీటిని తీసుకుపోవాల్సి వస్తోంది. నీటి కోసం ఇంటి వద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇంట్లో పెద్ద వారు ఉన్నా సుమారు అర కిలోమీటర్ దూరం ఉండడంతో నీరు తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

- పెద్ద భాజీ యువకుడు, స్థానికుడు

రోజూ 40 బిందెలను మోటార్ సైకిల్‌పై తెస్తున్నా



గ్రామ శివారులో ఉన్న బోరు వద్ద ఇంటికి సుమారు అర కిలోమీటర్ దూరం నుంచి ప్రతి రోజు 45 బిందెల నీటిని మోటార్ సైకిల్‌పై తెచ్చుకుంటున్నాను. బోర్లకు నీరు రాక పోవడంతో ఇంటి వద్ద ఉన్న కొళాయిలకు నీరు రావడంలేదు. రోజూ నీటి కోసం సుమారు రెండు గంటల సమయం కేటాయించాల్సి వస్తుంది. సింగిల్ ఫేస్ మోటార్ కావడంతో నీరు అరకొరగా మాత్రమే వస్తుంది. విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తినపుడు నీటికి తీవ్ర సమస్య ఏర్పడుతుంది. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా తాగునీరు సరఫరా చేసి నీటి సమస్యను తీర్చాలని కోరుతున్నాం.

- చిన్నకాశిం, స్థానికుడు



కరపత్రాలను చూపుతున్న విద్యార్థులు

వేసవి శిక్షణపై అవగాహన ర్యాలీ

గిద్దలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో జరిగే వేసవి శిక్షణ తరగతులకు సంబంధించి అవగాహన కల్పించేందుకు వీలుగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కరపత్రాలను ఆవిష్కరించారు. గిద్దలూరు, రాచర్ల గ్రంథాలయాల పరిధిలో జరిగిన కార్యక్రమాలలో గ్రంథపాలకులు ప్రసన్నకుమారి, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈనెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు గిద్దలూరు, రాచర్ల గ్రంథాలయాలలో 6 నుంచి 10 తరగతులలోపు విద్యార్థినీవిద్యార్థులకు ఉచితంగా వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్పోకెన్ ఇంగ్లీషు నేర్పించడమే కాకుండా మ్యూజిక్, డ్యాన్స్, వివిధ రకాల ఆటలపై ఉచితంగా శిక్షణ ఇస్తామని, ఈ అవకాశాన్ని పిల్లలు వినియోగించుకునే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

బేస్తవారపేట : బేస్తవారపేట శాఖ గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు పీవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఈ ప్రత్యేక శిబిరంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు.

పెద్దదోర్నాల : గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 6వ తేదీ వరకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఆటలు, పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, చదరంగం క్యారమ్స్‌పై శిక్షణ ఇస్తారని తెలిపారు.

ఎర్రగొండపాలెం : త్రిపురాంతకం, వైపాలెం శాఖ గ్రంథాలయంలో నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకులు జీ రామాంజి, ఝాన్సీ తెలిపారు. విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.

టైరు పగిలి సజ్జల లారీ బోల్తా



బోల్తా పడ్డ సజ్జల లారీ

పెద్దారవీడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : టైరు పగిలి సజ్జల లోడుతో వెళుతున్న లారీ బోల్తా పడిన ఘటన మండలంలోని తోకపల్లి సమీపం అమరావతి - అనంతపురం జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న సజ్జల లోడు లారీ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు టైర్ పగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ కార్తీక్, క్లీనర్, ఇద్దరు రైతులు గాయపడ్డారు. స్థానికులు వారికి సహాయక చర్యలు అందించారు. లారీ పూర్తిగా దెబ్బతినడంతో మరో లారీలో సజ్జలను మార్చుకొని వెళ్లారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

మానవత్వం చాటుకున్న బీజేపీ నాయకులు



అంత్యక్రియలు చేస్తున్న కృష్ణారావు, బీజేపీ నాయకులు

మార్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆస్తులు, అంతస్థులు అన్నీ ఉన్నా కడుపున పుట్టిన వాళ్ల పట్టించుకోకపోవడంతో ఎందరో అంతిమ సంస్కారాలకు అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అనాథ మృతిచెందితే అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నాడు పట్టణానికి చెందిన బీజేపీ నాయకుడు పీవీ కృష్ణారావు. సహచర పార్టీ నాయకులతో కలిసి స్థానిక సత్యహరిశ్చంద్ర స్మశానవాటికలో దహన సంస్కారాలు నిర్వహించి ఆదర్శంగా నిలిచాడు. వివరాల్లోకి వెళితే.. నాలుగు రోజుల కిందట మండలంలోని దరిమడుగు గ్రామ సమీపంలోని హైవేపై ఓ అనాథ వ్యక్తి చనిపోయారు. అతను పట్టణానికి చెందిన పేద బ్రాహ్మణుడిగా గుర్తించారు. అంతిమ సంస్కారాలు చేసేందుకు స్థోమతలేదని బంధువులు పోలీసులకు తేల్చిచెప్పారు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పీవీ కృష్ణారావు దహన సంస్కారాలను శాస్త్రోక్తంగా తాను నిర్వహిస్తానని పోలీసులకు తెలిపాడు. వారి అనుమతితో పోస్టుమార్టం అనంతరం ఆదివారం మృతదేహానికి దహన సంస్కారాలు పూర్తి చేశారు. ఆయన వెంట బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు చలువాది మురళి, ఎస్సీ సెల్ నాయకులు లింగాల నాగరాజు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

మార్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కనిగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జి.రమేష్ మార్కాపురంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో నివాసముంటున్న రమేష్ భార్య అనూషతో కలిసి ఆదివారం మార్కాపురం వచ్చారు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వారిని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రమేష్, అనూషకు గాయాలయ్యాయి. వెంటనే 108లో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.



మౌనదీక్ష చేస్తున్న జనసేన పార్టీ, టీడీపీ నాయకులు

ఉగ్రవాదుల దాడికి నిరసనగా మౌనదీక్ష

పొదిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా ఆదివారం పెద్దబస్టాండ్ సెంటర్లో టీడీపీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో మూడురోజుల సంతాపదినాల్లో భాగంగా మౌనదీక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా ముస్లిం మైనారిటీ అధ్యక్షుడు రసూల్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం దారుణమన్నారు. కనిగిరి జనసేన సమన్వయ కర్త వరికూటి నాగరాజు మాట్లాడుతూ కాల్పులు జరిపిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇమాంసాహెబ్, యాసిన్, బొడ్డు సుబ్బయ్య, ముని శ్రీనివాసులు జనసేన నాయకులు హల్‌చల్ జహీర్ పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడాలి

పుల్లలచెరువు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని కాపాడుకోవాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక దొనకొండ కమిటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని సుద్దురువ తాండా, రాచకొండ, వెంకటరెడ్డిపల్లె గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. శ్రీ ఆచార్య ప్రబోధనంద యోగీశ్వరులు రాసిన 100 రకాల గ్రంథాలను ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఏడుకొండలు, సభ్యులు చెన్నకేశవులు, బాల రంగయ్య, నవీన్ కుమార్, భార్గవి,కాశీలక్ష్మి, సరస్వతి, శ్రీను, కొండమ్మ పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ఫ్రీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

ఎర్రగొండపాలెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు పాఠశాలల్లో 1వ తరగతిలో 25 శాతం ఫ్రీ సీట్ల కోసం దరఖాస్తులను ఈనెల 28వ తేదీ నుంచి కోరుతున్నట్లు ఎంఈవో అంజనేయులు ఆదివారం తెలిపారు. బలహీన వర్గాల్లో అర్హత కలిగిన వారు ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు. మే 5లోపు ఆన్‌లైన్‌లో దరసాస్తు చేసుకోవాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ పిల్లలు, ఆర్థికంగా వెనుకబడిన వారు అర్హులన్నారు. ఈ విషయమై గ్రామాల్లో తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఎంఈవో ఆదేశించారు.

టెన్త్ టాపర్‌ను అభినందించిన ఎమ్మెల్యే

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతిలో 592/600 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో విశిష్ట ర్యాంకును సంపాదించిన బచ్చిగారి లక్ష్మీప్రియను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. ఆదివారం సాయంత్రం టీడీపీ కార్యాలయంలో లక్ష్మీప్రియను శాలువతో సన్మానించి అభినందించారు. రాచర్ల మండలం ఆకవీడు జడ్పీ హైస్కూలులో 10వ తరగతి చదువుతున్న బచ్చిగారి లక్ష్మీప్రియకు ఇటీవల వచ్చిన ఫలితాలలో 593 మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యను అభ్యసిస్తూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో లక్ష్మీప్రియ గుర్తింపు పొందడం గర్వకారణమని అభినందించారు. లక్ష్మీప్రియ ప్రతిభకు అనుగుణంగా ట్రిపుల్ ఐటీలో సీటు లభించే అవకాశం ఉందని, అక్కడ కూడా ప్రతిభతో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఆకవీడు హైస్కూలు ప్రధానోపాధ్యాయులు బి.సుధాకర్‌రావు, లక్ష్మీప్రియ తండ్రి శేఖర్, తదితరులు పాల్గొన్నారు. లక్ష్మీప్రియ మాట్లాడుతూ ఇది తన తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయుల మద్దతు వలన సాధ్యమైందని తెలిపారు.

విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇవ్వాలి

పొదిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక టింబర్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విశ్వబ్రాహ్మణులు తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయి పదవుల్లో స్థానం కల్పించాల్సిందిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సీఎం, డిప్యూటీ సీఎంలకు మా తరపున విన్నవించాలని నాయకులు కోరారు. వైసీపీ హయాంలో కూల్చేసిన ఆరామ క్షేత్రాన్ని తిరిగి నిర్మించాలన్నారు. త్వరలో 10వ తరగతిలో 500, ఇంటర్‌లో 850 మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు సామంతపూడి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మానందం, మర్రిపూడి సంఘ నాయకులు ఈదుమూడి రవి ప్రసాద్, ప్రసాద్, వినుకొండ శ్యామల, కార్పెంటరి సంఘం అధ్యక్షులు రాచర్ల శేఖర్, తదితర మండల నాయకులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వబ్రాహ్మణులు

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా

ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్య వైశ్యులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం అమ్మవారిశాల కమిటీ ఛైర్మన్ వాడకట్టు రంగసత్యనారాయణ నివాసంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ఆర్యవైశ్యులు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో తన విజయానికి మీరు చేసిన కృషిని మరువనన్నారు. ఆర్యవైశ్యులకు ప్రత్యేకంగా శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని రంగసత్యనారాయణ కోరారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ వెంటనే రెవెన్యూ అధికారులతో మాట్లాడి అందుకు సహకరిస్తానని తెలిపారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు సత్యనారాయణ (జిలకర), దమ్మాల జనార్దన్, వాడకట్టు శివప్రసాద్, పాల్గొన్నారు.



ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



ఘనంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మకు ఆదివారం ఘనంగా జాతర నిర్వహించారు. అర్చకులు పోలేరమ్మ మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో శక్తి స్వరూపిణిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగులపుట్టలో పాలుపోసి నాగదేవతలకు పాలాభిషేకం, పూజలు నిర్వహించారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. డివిజన్ నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి హాజరై పోలేరమ్మను దర్శించుకున్నారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

యోగా గురూజీ నారాయణరెడ్డికి అవార్డు



అవార్డును అందుకుంటున్న యోగా గురూజీ నారాయణరెడ్డి

గిద్దలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా గురూజీ నారాయణరెడ్డి మహాత్మ జ్యోతిరావుఫూలే జాతీయ ఐకాన్ అవార్డును అందుకున్నారు. రాజమండ్రిలోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆ సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ సరోజిని వెంకటేశ్వర్లు ఈ అవార్డును నారాయణరెడ్డికి అందచేశారు. సామాజికంగా అనేక సేవా కార్యక్రమాలు చేసిన నారాయణరెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

గిద్దలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : లైసెన్సు టెక్నికల్ సర్వేయర్, లైసెన్సు స్ట్రక్చరల్ ఇంజనీర్‌గా లైసెన్సు పొందేందుకు వీలుగా దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలో భవన నిర్మాణ స్వీయ ధ్రువీకరణ అంగీకార పత్రాలు సమర్పించేందుకు ఐటీఐ సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్, డీఆర్క్, బీఆర్క్ చదివి ఉత్తీర్ణులైన వారి నుంచి లైసెన్సు పొందేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో తెలుసుకోవాలని కమిషనర్ సూచించారు.



వసంతోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవంగా చెన్నుని వసంతోత్సవం



శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ఆదివారం నాలుగో రోజు వసంతోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీపతి అప్పనాచార్యులు చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు వసంతం చల్లి అనంతరం ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. మధ్యరంగ మండపంలో శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించి వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో పసుపు, చందనం, సుగంధభరిత ద్రవ్యాలు కలిపి భక్తులపై వసంతాలు చల్లారు. ఉభయదాతలుగా మద్దెల రంగారావు, సీతారావమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవ మూర్తులను నాలుగు మాడవీధులలో కనులపండువుగా నగరోత్సవంలో విహరించారు. ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి, ఉత్సవ సేవా సంఘం అధ్యక్షుడు యక్కలి కాశీవిశ్వనాథం, సభ్యులు పాల్గొన్నారు.

నేడు ఊంజల్ సేవ

చెన్నకేశవస్వామికి సోమవారం లక్ష్మీ చెన్నకేశవ వికాసతరంగిణి మహిళా విభాగం ఆధ్వర్యంలో ఊంజల్ సేవ నిర్వహించనున్నారు.

కుందంపల్లికి రోడ్డేసేదెప్పుడో..?

- 2019లో శంకుస్థాపన
- ఏళ్లుగా నిలిచిన పనులు
- రాకపోకలకు ఇబ్బందులు

పుల్లలచెరువు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కుందంపల్లి రోడ్డు అధ్వానంగావు ఉంది. ఏడేళ్ల కిందట చేపట్టిన పనులు నేటికి కూడా మొదలు పెట్టిన పాపాన పోలేదు. దీంతో నిత్యం ప్రజలు రహదారి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. కుందంపల్లికి రోడ్డు ఏప్పుడు వేస్తారోనని ఎదురు చూస్తున్నారు. ఐదేళ్ల కిందట వైసీపీ పాలకులు తట్టెడు మట్టిని వేసిన పాపాన పోలేదు. గత టీడీపీ హయంలో కుందంపల్లి గ్రామస్థుల ఇబ్బందులను గుర్తించి 2018లో ప్రత్యేక ప్యాకేజీ ద్వారా నిధులు మంజూరు చేశారు. అప్పటి కాంట్రాక్టరు ఎన్నికల కారణంగా పనులు మొదలు పెట్టలేదు. జగన్‌రెడ్డి వచ్చాక 2020 జనవరి 14న అప్పటి మంత్రి ఆదిమూలపు సురేష్ అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. ఆ తరవాత వెంటనే కాంట్రాక్టరు పనులు మొదలు పెట్టి చిప్స్ పరిచారు. అయినా వైసీపీ హయాంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో ఆ పనులను నిలిపివేశారు. అప్పటి నుంచి పనులు పూర్తిగా నిలిపివేయడంతో కుందంపల్లి గ్రామస్థులు వర్షం పడినప్పుడు బురదలో, మిగిలిన రోజుల్లో గాలి, దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. టీడీపీ హయాంలో మంజూరు చేసిన రోడ్డుకు నేటికి కుడా పనులు పూర్తి చేయకపోవడంతో ప్రభుత్వం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే కుందంపల్లి రోడ్డు పనులు ప్రారంభించాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న కుందంపల్లి రహదారి

నేటి నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ శాఖాధికారి బి.విజయకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులకు 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులు హాజరుకావాలని కోరారు.

విద్యార్థులకు క థలు చెప్పటం, డ్రాయింగ్, పెయింటింగ్ నేర్పించటం, ఆటలు ఆడించటం, పాటలు పాడించటం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు శిక్షణ తరగతులకు తమ పిల్లలను పంపి విజయవంతం చేయాలని కోరారు.

వ్యవసాయ యూనివర్సిటీ వజ్రోత్సవాలను విజయవంతం చేయాలి

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలను విజయవంతం చేయాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ జి.రమేష్ కోరారు. ఈసందర్భంగా గుంటూరులోని లాం ఫాం ఆడిటోరియంలో ఈనెల 29, 30 తేదీల్లో వజ్రోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పలువురు మంత్రులు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని తెలిపారు. ఈఉత్సవాల్లో అధికసంఖ్యలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేద ముస్లింలకు అందని వక్ఫ్ ఆస్తులను జాతీయం చేయాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేద ముస్లిం సమాజానికి ఎందుకు ఉపయోగపడని వక్ఫ్ ఆస్తులను కేంద్ర ప్రభుత్వం జాతీయం చేయాలని ముస్లిం జాగరణ్ మంచ్ రాష్ట్ర నాయకుడు షేక్ మహ్మద్‌బుజ్జి డిమాండ్ చేశారు ఆదివారం ఒంగోలు నగరం ఇస్లాంపేటలోని సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుపేద ముస్లింలకు ఉపయోగపడాల్సిన వక్ఫ్ భూములు కొంతమంది ముస్లిం మతపెద్దల చేతుల్లోకి వెళ్ళిపోయాయని ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులను కొందరు అందినకాడికి దోచుకొని అమ్ముకుంటున్నారని, అందువల్ల వక్ఫ్ భూములను దేశ ప్రజలకు అంకితం చేయాలని డిమాండ్ చేశారు.

దేశవ్యాప్తంగా ఎక్కడ కూడా నిరుపేద ముస్లింలు వక్ఫ్ ఆస్తులను అనుభవించడం లేదని, మతపెద్దల ద్వారానే అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో సవరణలు చేయడంపై నిరుపేద ముస్లిం అభినందిస్తున్నారని ఆయన తెలిపారు.

నిరుపేద ముస్లింల వైద్య, విద్య కోసం, వారి అభివృద్ధి కోసం ఏమాత్రం ఉపయోగపడని వక్ఫ్ ఆస్తులను దేశ ప్రజల ఆస్తిగా ప్రకటించి జాతికి అంకితం చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో పలువురు జాగరణ్‌మంచ్ నాయకులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇవ్వాలి

పొదిలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో విశ్వబ్రాహ్మణులకు గుర్తింపు ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లి శ్రీనివాసరావు కోరారు. ఆదివారం స్థానిక టింబర్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి విశ్వబ్రాహ్మణులు తీవ్రంగా కృషి చేశారని గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఎన్నో ఆశలు పెట్టుకున్న విశ్వబ్రాహ్మణుల సంక్షేమానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రస్థాయి పదవుల్లో స్థానం కల్పించాల్సిందిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సీఎం, డిప్యూటీ సీఎంలకు మా తరపున విన్నవించాలని నాయకులు కోరారు.

వైసీపీ హయాంలో కూల్చేసిన ఆరామ క్షేత్రాన్ని తిరిగి నిర్మించాలన్నారు. త్వరలో 10వ తరగతిలో 500, ఇంటర్‌లో 850 మార్కులు సాధించిన విశ్వబ్రాహ్మణ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేయనున్నట్లు సామంతపూడి నాగేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పొన్నపల్లి బ్రహ్మానందం, మర్రిపూడి సంఘ నాయకులు ఈదుమూడి రవిప్రసాద్, ప్రసాద్, వినుకొండ శ్యామల, కార్పెంటరి సంఘం అధ్యక్షులు రాచర్ల శేఖర్, తదితర మండల నాయకులు, సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పోలేరమ్మ జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మకు ఆదివారం ఘనంగా జాతర నిర్వహించారు. అర్చకులు పోలేరమ్మ మూలవిరాట్‌ను వివిధ రకాల పుష్పమాలలు, నిమ్మకాయ దండలతో శక్తి స్వరూపిణిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు, విశేష అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారికి పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించారు. నాగులపుట్టలో పాలుపోసి నాగదేవతలకు పాలాభిషేకం, పూజలు నిర్వహించారు. కుంకుమ బండ్లు కట్టి మొక్కులు తీర్చుకున్నారు. డివిజన్ నుంచే కాక వివిధ ప్రాంతాల నుంచి హాజరై పోలేరమ్మను దర్శించుకున్నారు.

ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

క్రమబద్ధీకరణకు నోచుకోని 22ఏ భూములు

- తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- గత వైసీపీ పాలనలో ముడుపులు తీసుకున్న అధికారులు
- సమస్య పరిష్కారంకాక రైతుల ఇక్కట్లు

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యంతో 22ఏలో చేరిన పట్టాభూములు ఏళ్ల తరబడి క్రమబద్ధీకరణకు నోచుకోక హక్కుదారులు అల్లాడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ పనులు జరగకపోవటంతో ఇబ్బందులు పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది అధికారులు 22ఏలో నుంచి తొలగిస్తామని రైతుల వద్ద లక్షలాది రూపాయల ముడుపులు తీసుకొని పనులు చేయకుండా వెళ్లిపోయారు. ఇప్పుడు ఏం చేయాలె పాలుపోక ఆ రైతులు అల్లాడుతున్నారు. అధికారులు చేసిన తప్పిదానికి తాము బలికావాల్సి వచ్చిందని వాపోతున్నారు. అత్యవసరమైన పనులకోసం, ఆర్థిక ఇబ్బందుల కోసం విక్రయించుకునే వీలులేక పడరాని పాట్లు పడుతున్నారు. కనీసం బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు కూడా ఇవ్వటం లేదు.

గతంలో రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై ఎన్నోసార్లు క్రయవిక్రయాలు జరిగిన భూములు కూడా 22ఏ లో చేర్చారు. ప్రస్తుతం ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలు పడుతున్నారు. తమను మోసంచేసి ప్రభుత్వ భూములు విక్రయించారని ఆరోపిస్తున్నారు. వాస్తవంగా ఆ భూములు రికార్డుల ప్రకారం పట్టాభూములైనప్పటికీ అధికారులు ఉద్దేశపూర్వకంగా అనేక గ్రామాల్లో 22ఏ లో చేర్చారు. పలు గ్రామాల్లో కోర్టుల ద్వారా పట్టాలు పొంది రికార్డులు క్రమబద్ధీకరించుకొని కొందరు సాగు చేసుకుంటున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. అలాంటి భూములను కూడా 22ఏలో చేర్చారు.

దర్శికి చెందిన కొంతమంది రైతుల పట్టాభూములను 22ఏలో చేర్చటమే కాక లంకోజనపల్లి రెవెన్యూలో కలిపారు. ఇక్కడి భూములను అక్కడి 22ఏ జాబితాలో ఎలా కలిపారో అర్థంకాలేదు. ఈ విషయాలను రైతులు గుర్తించి అధికారులు చేసిన తప్పిదాలపై మండిపడుతున్నారు. కొంతమంది రైతులు కోర్టులకు వెళ్లి 22ఏలో చేరిన భూములను పట్టాభూములుగా హక్కుకల్గేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ భూములను మాత్రం అధికారులు తప్పనిసరి పరిస్థితుల్లో క్రమబద్ధీకరించారు. మిగిలిన భూముల గురించి పట్టించుకోలేదు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ముడుపులు తీసుకున్న అధికారులు ఇప్పుడు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అధికారుల చుట్టూ తిరిగినా పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. గట్టిగా ఒత్తిడి తెచ్చిన కొంతమంది రైతులకు తిరిగి డబ్బులు ఇచ్చారు. మరికొందరికి నేటికీ ఇంకా డబ్బులు ఇవ్వలేదు. తాము ఆ పనిచేస్తామని ఇంకా మాయమాటలు చెబుతున్నారు. ఏళ్ల తరబడి వేచి చూసిన రైతులు ఇక పనులు జరగవనే ఉద్దేశంతో కొంతమంది కోర్టుకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 22ఏలో చేరిన భూములను క్రమబద్ధీకరిస్తామని ప్రకటించటంతో ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా రైతుల ఇబ్బందులను గుర్తించి రికార్డులు క్రమబద్ధీకరించేలా ఉత్తర్వులు ఇచ్చి న్యాయం చేయాలని రైతులు కోరుతున్నారు.

పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

- ప్రభల నిర్వాహకులకు డీఎస్పీ సూచన

వీసీపల్లి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగనున్న గంగమ్మ తల్లి తిరుణాలలో ప్రభలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. మేనెలలో జరిగే గంగమ్మ తిరుణాలలో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు ప్రభలను ఏర్పాటు చేయనున్నారు. గతంలో జరిగిన ఘటనల దృష్ట్యా పోలీసులు ఆదివారం గంగమ్మ గుడి ప్రాంగణంలో ప్రభలు ఏర్పాటుచేసే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ ప్రభల వద్ద ఎటువంటి ఘర్షణలు జరగకుండా నిర్వాహకులు కమిటీని ఏర్పాటు చేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు ప్రభలకు మూడువైపులా ఇనుప రాడ్లతో బారికేడ్‌లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తిరుణాలకు వచ్చే భక్తులకు సౌండ్ పొల్యూషన్ లేకుండా నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటుచేసుకోవాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో అసభ్యకరమైన డాన్స్‌లు వేయరాదన్నారు. ప్రభల మీద రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. అటువంటి వ్యాఖ్యలు ఎవరైనా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.



నిర్వాహకులతో మాట్లాడుతున్న డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

సమావేశంలో సీఐ ఖాజావలి, ఎస్సై జి.కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన తూర్పుగంగవరం పంచాయతీ సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగమ్మ తల్లిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గంగమ్మను దర్శించుకున్నారు. గంగమ్మకు మొక్కలు తీర్చుకుంటూ పొంగళ్లు పెట్టి అమ్మవారి చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యంగా సమర్పించారు. కొందరు భక్తులు తమ వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు.

ఆలయ అర్చక పూజారి ఎన్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌వి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నారాయణస్వామికి..

సీఎస్‌పురం(పామూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థాన వ్యవస్థాపకులు కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో శ్రీగిరిరాజు నరసింహబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించి వివిధరకాల పూలతో అలంకరణచేశారు. మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయచుట్టూ ప్రదక్షిణ చేసి స్వామివారికి సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థాన ఆవరణలో ఉన్న గోశాలలోని గోవులకు పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

దర్శిలో జోరుగా అక్రమ కొళాయిలు

- ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల చేతివాటం

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో విచ్చలవిడిగా అక్రమ కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది వేలాది రూపాయలు ముడుపులు తీసుకొని సహకరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్‌ఏపీ రక్షిత మంచినీటి పథకం కింద 120 గ్రామాలు ఉన్నాయి. అందులో దర్శి పట్టణం కూడా ఉంది. కేవలం మంచినీటి అవసరాల కోసం ఎస్‌ఏపీ ట్యాపులు గతంలో వేశారు. కాలక్రమంలో కొంతమంది సొంత అవసరాలకు కూడా అక్రమ కొళాయిలు ఏర్పాటు చేసుకున్నారు.

గత ప్రభుత్వంలో విరివిగా ఏర్పాటు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమ కొళాయిల ఏర్పాటు విచ్చలవిడిగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా సాగుతున్నాయి. అక్రమ కొళాయిలతో అసలైన వాటికి నీరు అందటం లేదు. గృహాలకు అక్రమ కొళాయిలు వేయించుకున్న వ్యక్తులు ఇంటి అవసరాలకు కూడా ఈనీటిని వాడుకుంటున్నారు. ఎంతో విలువైన నీరు అక్రమ కొళాయిల రూపంలో వృథా అవుతుండటంతో స్కీమ్ పరిధిలోని గ్రామాలకు సక్రమంగా నీరు అందటం లేదు.

సుమారు 45 సంవత్సరాల క్రితం నెదర్లాండ్ ప్రభుత్వ సహకారంతో ఎస్‌ఏపీ పథకం ఏర్పాటు చేశారు. ఆసమయంలోనే దర్శి రెండు కొండల మధ్య ఎస్‌ఏపీ చెరువును నిర్మించారు. అప్పుడు స్కీమ్ పరిధిలో 110 గ్రామాలు ఉండేవి. కాలక్రమంలో గ్రామాలు రెట్టింపు కావటంతోపాటు జనాభా మూడింతలు పెరిగింది. 45 సంవత్సరాల క్రితం నిర్మించిన చెరువు పూడిపోయి నిల్వ సామర్థ్యం తగ్గిపోయింది. ఈపరిస్థితుల్లో స్కీమ్ పరిధిలోని శివారు గ్రామాలకు సక్రమంగా నీరు అందించలేక పోతున్నారు. దర్శి పట్టణంలో అక్రమ కొళాయిలతో మరికొంత నీరు వృథా అవుతుండటంతో వేసవిలో దర్శి పట్టణంలోని శివారు కాలనీలకు నీరు అందటం లేదు.

రెండువేల అక్రమ కొళాయిలు

అధికారుల లెక్కల ప్రకారం దర్శి పట్టణంలో 670 పబ్లిక్ కొళాయిలు ఏర్పాటు చేసినట్లు రికార్డుల్లో ఉంది. ప్రస్తుతం కొళాయిల సంఖ్య మూడు వేలకు పైగా చేరింది. సుమారు రెండు వేల కొళాయిలు అక్రమంగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను వివరణ కోరగా గతంలో కొన్ని అక్రమ కొళాయిల ఏర్పాటు వాస్తవమేనన్నారు. ఇటీవల దర్శి పట్టణంలో నీటి పంపిణీ బాధ్యతను నగర పంచాయతీకి అప్పగించామని చెబుతున్నారు. అక్రమ కొళాయిలను క్రమబద్ధీకరించుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెబుతున్నారు.

ఈవిషయంపై నగర పంచాయతీ కమిషనర్ వై.మహేశ్వరరావును ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాము స్కీమ్ నిర్వాహణ బాధ్యత తీసుకోలేదన్నారు. దర్శి పట్టణంలో పగిలిన పైపులైన్‌తో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పబ్లిక్ కొళాయిల వివరాలు ఇవ్వలేదన్నారు. అక్రమ కొళాయిలు ఏర్పాటు చేసుకుంటున్నట్లు తమకు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. రెండు రోజుల క్రితం లంకోజనపల్లిలో అక్రమంగా వేసిన కొళాయిలతో ఆ వీధిలోని పబ్లిక్ ట్యాపులకు నీరంద లేదని ఫిర్యాదులు చేయటంతో తొలగించామన్నారు. ఎక్కడైనా అక్రమ కొళాయిల ఏర్పాటు జరిగితే తమకు ఫిర్యాదు చేయాలని స్పష్టం చేశారు.

కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లు

- పొంచిఉన్న ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

పామూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లతో ప్రమాదాలు పొంచిఉన్నాయి. పలుచోట్ల జనవాసాల మధ్య విద్యుత్‌శాఖ ఏర్పాటుచేసింది. దీంతో ఎప్పుడు ఏరూపంలో ప్రమాదం ముంచుకొస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా అనుకోని సంఘటనలు జరిగితే తప్ప ఆ శాఖ అధికారుల్లో కదలిక ఉండటంలేదు. కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌లతో మూగజీవాలు విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందిన సంఘటలు ఉన్నాయి. పామూరు పట్టణంలోని కందుకూరు రోడ్డు, సీఎస్‌పురం రోడ్డులోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన రక్షణ వలయం ఏర్పాటుచేయకుండా విద్యుట్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. నిత్యం ఆమార్గంలో ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఎదురెదురుగా పెద్ద వాహనాలు వచ్చినప్పుడు వాహనచోదకులు అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మర్లకు తగిలితే అంతే సంగతులు.

ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ వలయాలను ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పామూరులోని నెల్లూరు రోడ్డులో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్

బాధిత కుటుంబాలకు సాయం

పామూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మానవతా సేవాసంస్థ తరుపున అనారోగ్యంతో బాధపడుతున్న నలుగురు బాధిత కుటుంబసభ్యులకు దాతల సహకారంతో రూ.22,500 ఆర్థిక సహకారం అందజేసినట్టు ఆసంస్థ అధ్యక్షుడు ఎం.ముసలయ్య తెలిపారు. ఆదివారం పామూరుకు చెందిన షేక్ బేగంకు రూ. 7,500, గోపాలపురంకు చెందిన మనివర్ధన్, మనోహర్‌లకు రూ.10 వేలు, పందిటి మాలకొండయ్యకు రూ.5 వేలు సాయం బాధిత కుటుంబసభ్యులకు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ పీఎండీ రహమాన్, కార్యదర్శి ఎన్.బాబురావు, టి.రమేష్, వి.వెంకటేశ్వర్‌రెడ్డి, కె.నాగేశ్వరరావు, తదిత రులు పాల్గొన్నారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి

కనిగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి బాలుడు మృతి చెందాడు. ఈఘటన ఆదివారం మండలంలోని బూతంవారిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమలదిన్నె చిన్నా (13) మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలలకు వేసవి సెలవులు ఇవ్వటంతో పాటు ఆదివారం కావటంతో తన తోటి స్నేహితులతో కలసి గ్రామ సమీపాన ఉన్న జగనన్న కాలనీ సమీపంలో నీటి గుంతల్లో ఈత కొట్టేందుకు వెళ్ళాడు. ఈక్రమంలో మృతుడు గట్టుపై నుంచి ఒక్క ఉదుటున గుంతలో ఉన్న నీటిలోకి దూకాడు. మిగతా స్నేహితులు కూడా ఈత కొట్టేందుకు ఆలోచన చేస్తూ గట్టుపై ఉన్నారు. గుంతలోకి దూకిన చిన్నా ఎంతకూ పైకిరాలేదు. దీంతో వారు ఆందోళన చెందుతూ గ్రామంలో పొగాకు బ్యార్నీ వద్ద కట్టలు కడు తున్న మృతుడు తల్లికి జరిగిన విషయాన్ని వివరించారు. దీంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని గుంతలో దిగి చూడగా కాళ్ళుపైకి ఉండి తల నీటి ఊబిలో చొచ్చుకుని ఉంది. వెంటనే కనిగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లిదండ్రులు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వారికి కుమారుడు (చిన్నా), కుమార్తె ఉన్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈఘటనపై తమకు సమాచారం లేదని పోలీసులు తెలిపారు.

టీడీపీ వార్డు కమిటీల ఎంపిక

దర్శి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో టీడీపీ నూతన కమిటీల నియామకానికి శ్రీకారం చుట్టారు. బూత్ కమిటీలు, వార్డుల కమిటీలకు నూతన అధ్యక్షులను ఎన్నుకునే ప్రక్రియ చేపట్టారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు నాయకులు, కార్యకర్తలతో చర్చించి కమిటీల నియామకం జరుపుతున్నారు. దర్శి నగర పంచాయతీలో ఇప్పటికే 16 వార్డులకు కమిటీ అధ్యక్షులను నియమించారు. మరో నాలుగు వార్డులకు అధ్యక్షులను నియమిస్తే నగర పంచాయితీలో కమిటీల ఎంపిక పూర్తవుతుంది.

1వ వార్డుకు కోరె లక్ష్మీనారాయణ, 2వ వార్డుకు సందు జనార్దన్, 3వ వార్డుకు సంగు కొండలు, 4వ వార్డుకు జీసీ అనీల్, 5వ వార్డుకు కూటాల శ్రీనివాసరావు, 6వ వార్డుకు పఠాన్ సుభానీ, 7వ వార్డుకు ఆవుల రమణారెడ్డి, 8వ వార్డుకు నెలకుర్తి మాల్యాద్రి, 9వ వారుక్డు జమిని నాగేశ్వరరావు, 10వ వార్డుకు పాశం శ్రీనివాసరావు, 11వ వార్డుకు నీలిశెట్టి నారాయణ, 13వ వార్డుకు సారెడ్డి శ్రీనివాసరెడ్డి, 14వ వార్డుకు దొంత శ్రీనివాసరావు, 15వ వార్డుకు కప్పాల సురేష్, 18వ వార్డుకు నారపుశెట్టి శ్రీనివాసులు వార్డు కమిటీల అధ్యక్షులుగా ఎంపికయ్యారు. మిగిలిన వార్డులకు కమిటీలను నియమించాల్సి ఉంది. ఈసందర్భంగా డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతోపాటు పార్టీ కార్యక్రమాలు కూడా వేగవంతంగా అందరి సహకారంతో పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి



మంత్రి సత్యకుమార్ సమక్షంలో బీజేపీలో చేరిన ప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దికూరపాడుకు చెందిన వైసీపీ నేత, వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మూలంరెడ్డి ప్రసాద్‌రెడ్డి విజయవాడలోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్‌ల సమక్షంలో పార్టీలో చేరారు. ప్రసాద్ రెడ్డికి సత్యకుమార్ బీజేపీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తాళ్లూరు మండలంలో బీజేపీ బలోపేతానికి తన వంతు కృషిచేస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ నాయకులు మాడపాకుల శ్రీనివాసులు, తిండి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ ఏకపక్ష నిర్ణయాలతో తల్లిదండ్రుల ఆందోళన

పామూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ ఏకపక్ష నిర్ణాయాలతో మండలంలో పలు పాఠశాలలు మూతపడే అవకాశాలు ఉండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని బోడవాడ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో ఒకటి నుంచి ఏడో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు 6, 7 తరగతులను 15 కిలోమీటర్ల దూరంలోఉన్న బొట్లగూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి విలీనం చేయనున్నారు. విద్యాకమిటీ తీర్మానం లేకుండనే ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం సమంజసం కాదని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. అలాగే, అప్పమాంబపురం పాఠశాలలోని 3,4,5 తరగతులను కమ్మవారిపాలెం పాఠశాలలో విలీనం కానుండగా మోపాడు కొండారెడ్డి పాఠశాల మూతపడనున్నది. ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి విద్యాశాఖ అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడంతో విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఎస్‌ఎంసీ కమిటీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు వైఫల్యం

కనిగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పరిష్కరించటంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ధ్వజమెత్తారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులకు నష్టాన్ని తెచ్చిపెట్టే నల్లచట్టాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఈచట్టాలపై దేశవ్యాప్తంగా పోరాటాలు చేసినట్టు చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు జీవీ కొండారెడ్డి, పీసీ కేశవరావు, నరేంద్ర, బషీరా, ఏడుకొండలు, పిచ్చయ్య, సీహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో గందరగోళ పరిస్థితులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల పునర్విభజనలో అధికారులు రోజుకొక ప్రతిపాదన, పూటకొక సవరణతో గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి ఆరోపించారు. ఆదివారం ఒంగోలులోని మల్లయ్యలింగం భవన్‌లో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు కె.యర్రయ్య అధ్యక్షత వహించారు. రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేది ఒకరకంగా, కార్యచరణ మరోలా ఉండటం శోచనీయమన్నారు. ఈ విషయంలో ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి జోక్యం చేసుకొని గందరగోళ పరిస్థితులను చక్కదిద్దాలని కోరారు.

రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మాట్లాడుతూ సీపీఎస్‌కు బదులుగా ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. పీఆర్సీ కమిషన్‌ను ఏర్పాటుచేసి వెంటనే ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు.

సమావేశంలో నెల్లూరు జిల్లా అధ్యక్షుడు అశోక్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.నరసింహారెడ్డి, ఆర్థిక కార్యదర్శి నాగయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు మాలకొండయ్య, ఆదినారాయణ, దాసరి శ్రీనివాసులు, కడియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగు చేసిన బర్లీ పొగాకు రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరారు. తూర్పునాయుడుపాలెంలో ఆదివారం రైతు సంఘాల నాయకులు మంత్రి డాక్టర్ స్వామిని కలిసి సమస్యను వివరించారు. గత ఏడాది బర్లీ పొగాకు ధరలు బాగా ఉండటంతో ఈ ఏడాది కూడా ధరలు బాగా ఉంటాయని కంపెనీ ప్రతినిధులు ప్రోత్సహించడంతో రైతులు విస్తారంగా సాగు చేశారన్నారు. ఈ పంటను 90శాతం మంది కౌలు రైతులే సాగు చేశారని తెలిపారు. పంట చేతికి వచ్చి అమ్ముకునే సమయం వచ్చే సరికి కంపెనీల ఏజెంట్లు పొగాకు కొనుగోలు చేయడం లేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తక్కువ ధరకు కొనుగోలు చేయాలని చూస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. బర్లీ పొగాకుకు గత సంవత్సరం ఇచ్చిన విధంగా టన్ను రూ.18వేలకు కొనిపించాలని, కంపెనీలు కొనుగోలు చేయకపోతే ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బర్లీ పొగాకును బోర్డు పరిధిలో చేర్చే విధంగా చూడాలనిమంత్రిని కోరారు.

కార్యక్రమంలో నాయకులు చుండూరి రంగారావు, డాక్టర్ కొల్లా రాజమోహన్, జయంతిబాబు, కె.హనుమారెడ్డి, కె.వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మార్కాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : వెనుకనుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన ఆదివారం రాత్రి అల్లూరి పోలేరమ్మ గుడి సమీపంలో చోటుచేసుకుంది. టౌన్ ఎస్‌ఐ ఎం.సైదుబాబు తెలిపిన వివరాల మేరకు.. కనిగిరి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన జి.రమేష్ మార్కాపురంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు గ్రామంలో నివాసముంటున్న రమేష్ భార్య అనూషతో కలిసి ఆదివారం మార్కాపురం వచ్చారు. మోటార్ సైకిల్‌పై వెళ్తున్న వారిని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం సమీపంలో గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో రమేష్, అనూషకు గాయాలయ్యాయి. వెంటనే 108లో వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు.

ఉష్ణోగ్రత (అంచనా)

28-4-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	39	26
చీరాల	36	28
నరసరావుపేట	39	25
బాపట్ల	36	27
రెంటచింతల	40	25

వరద పనులపై.. అలసత్వం



- మాన్‌సూన్‌యాక్షన్ ప్లాన్ శూన్యం
- వేసవి వచ్చినా పుర పాలకులు చోద్యం
- మున్సిపాల్టీల్లో పూడిపోయిన వరద నీటి కాల్వలు
- భారీ వర్షం కురిస్తే మున్సిపాల్టీలో కాలనీలు మునకే

వర్షాలతో వరద.. ఇళ్లు మునకతో మున్సిపాల్టీల్లో ప్రజలు వణికిపోతున్నారు. ఓ మోస్తరు వర్షాలు కురిసినా ఆ నీరు పోయే మార్గాలు లేక ఎక్కడికక్కడ కాలనీలు మునిగి పోతున్నాయి. ప్రజలకు వరద కష్టాలు తప్పించేందుకు మాన్‌సూన్ యాక్షన్ ప్లాన్ అమలు చేయాల్సిన పుర పాలకులు చోద్యం చూస్తున్నారు. వర్షాలతో ముంపు సమయాల్లో హడావుడి చేయడానికే మున్సిపల్ అధికా రులు, పాలకులు ప్రాధాన్యం ఇస్తున్నారే కానీ ముందస్తు చర్యలపై శ్రద్ధ చూపడంలేదు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని మున్సిపల్ కేంద్రాల్లోని కాల్వలు జమ్ము, వ్యర్థాలు, తూటికాడలతో నిండి ఉంటున్నాయి. దీంతో ఓ మోస్తరు వర్షం పడినా ఆ నీరు పోయే మార్గాలు లేక లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతున్నాయి. రోజుల తరబడి ఆ ప్రాంతాల్లోని నివాసితులు నీటి మధ్య అల్లాడుతున్నారు. అదే వేసవిలో డ్రెయిన్లలో పూడిక తీస్తే వర్షపు నీరు సాఫీగా పారుదలై ప్రజలకు ముంపు కష్టాలు లేకుండా ఉంటాయి. అయితే వర్షాకాల ముందస్తు ప్రణాళిక, పనులపై అటు పాలకులు, ఇటు అధికారులు పట్టీపట్టనట్లుగా ఉంటున్నారు. వేసవిలో చేయాల్సిన పనులను వర్షాల సమయంలో చేస్తూ జేబులు నింపుకుంటున్నారన్న విమర్శలున్నాయి.

పనులు.. ఇలా చేయాలి

మున్సిపాల్టీల్లో పూడిపోయిన కాల్వలను పునరుద్ధరించి వరద నీరు సులువుగా ప్రవహించే విధంగా చర్యలు చేపట్టాలి. ప్రధాన మురుగు కాల్వల్లో ప్రారంభం నుంచి చివరి వరకు పూడిక తీసి నీటి ప్రవాహానికి ఆటంకాలను తొలగించాలి. కాల్వల్లో పెరిగిన జమ్ము, నాచు తొలగించాలి. వర్షాకాల ముందస్తు పనులకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాలి. ఇంజనీరింగ్, ప్రణాళికా, పారిశుధ్య విభాగాల అధికారులు కమిటీగా ఏర్పడి సమన్వయంతో ఆయా పనులు చేయాలి. కాల్వలపై ఉన్న ఆక్రమణలు తొలగించి నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చర్యలు తీసుకోవాలి.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

పురపాలక సంఘాల్లో మురుగు, వరదనీటి కాల్వలు పూడికతో నిండిపోయి.. ఓ వర్షాలకే పలు ప్రాంతాలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో వర్షాలు వస్తున్నాయంటే ప్రజలు వణికిపోతున్నారు. వాస్తవానికి మురుగు కాల్వల్లో పూడిక తీత పనులు నిరంతరం కొనసాగిస్తుండాలి. ప్రస్తుత వేసవి కాలం పూడికతీత పనులకు అనువైన వాతావరణం. అయితే ఆయా పనులపై పురపాలకులు ప్రణాళికలతో ముందుకు వెళ్లడంలేదు. సమస్య వచ్చినపుడు మాత్రమే నిద్ర మేల్కొనడం అలవాటుగా మార్చుకున్నారన్న విమర్శలున్నాయి. వర్షాలు కురిసే ముందు హడావుడిగా పనులు చేపడుతున్నారు. దీని వల్ల ఫలితం లేకపోగా పాలకులు, కాంట్రాక్టర్లకు జేబులు నిండుతున్నాయి. వర్షాకాలంలో పనులు కంటికి కనిపించవు.. ఖర్చుల లెక్కతేలదు.. దీంతో నిధులు పక్కదారి పడుతున్నాయి. ప్రతి మున్సిపాల్టీలో వేసవి ప్రణాళికను అమలు చేయాలి. వర్షాకాలంలో ప్రజలకు మురుగు.. వరద నీటి ఇబ్బందులు లేని విధంగా ముందస్తుగా చర్యలు చేపట్టాలి.



వరద నీటి మునకలో నరసరావుపేట (పాత చిత్రం)

వర్షాలు కురవక ముందే పురపాలక సంఘాలలో ముంపు నివారణకు అవసరమైన పనులు పూర్తి చేయాలి. గతంలో ఏఏ ప్రాంతాలు వరదనీటితో ముంపుకు గురయ్యాయో గుర్తించి ఆయా ప్రాంతాల్లో కాల్వలను అభివృద్ధి చేయాలి. వర్షాలు కురిస్తే ఈ పనులు చేపట్టేందుకు వీలుండదు. ఇప్పటికైనా ముంపు నివారణలో భాగంగా కాల్వల్లో పూడికత తీత పనులు చేపట్టాలి. గత అనుభవాలను పరిశీలనలోకి తీసుకుని వరద నీరు గృహాల్లోకి ప్రవేశించకుండా పూర్తి స్థాయి చర్యలు చేపట్టాలి. ఈ దిశగా మున్సిపల్ అధికారులు స్పందించడం లేదు. వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేసే విషయంలో పురపాలకులు మొద్దు నిద్ర వీడటం లేదు. జూన్ మొదటి వారంలో వర్షాలు కురుస్తుంటాయని తెలిసినా పురపాలకుల్లో చలనం లేదు. సదరు విభాగాల అధికారులు వరద నీటి కాల్వల్లో పూడిక తీత పనులు, పగిలిన కట్టడాల పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ఇంకా సమాయత్తం కాకపోవటం గమనార్హం. వరదల సమయంలో ముంపునకు గురయ్యే గృహాల వారికి సాయం అందించే కన్నా ముందస్తు చర్యలు తీసుకోవడం మిన్న అనే అంశాన్ని అధికారులు విస్మరిస్తున్నారు. దీంతో పట్టణ ప్రాంతాల్లో ఏటా ముంపు ప్రాంతాల్లోని ప్రజలు వరద కష్టాలను ఎదుర్కొంటు న్నారు. ఈ ఏడాదైనా ప్రజలను ముంపు కష్టాల నుంచి గట్టెక్కించేందుకు ఇప్పటికైనా వర్షాకాలం ముందస్తు పనులు చేప ట్టే అంశంపై ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మొక్కుబడిగా మమ

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు వర్షాకాల ముందస్తు ప్రణాళికను పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పురపాలక సంఘాల్లో చిన్న పెద్ద కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టాలని భావించింది. గత జూలైలో పూడిక తీతకు నిధులు మంజూరు చేసింది. కొన్ని మున్సిపాల్టీల్లో ఈ పనులు మొక్కుబడిగా నిర్వహించారు. మరి కొన్ని మున్సిపాల్టీలు మమ అనిపించాయి. కేవలం నిధులు ఖర్చు చూపించాలన్న ఉద్దేశంతోనే పనులు చేపట్టారే కానీ ముంపు సమస్య పరిష్కరించాలన్న ఉద్దేశం లేదన్న విమర్శలు వచ్చాయి.

నరసరావుపేటలో జమ్ము, వ్యర్థాలతో పూడి పోయిన ప్రధాన వరద నీటి కాల్వలు



కబ్జాలో కాల్వలు

జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్లతో పాటు మూడు జిల్లాల పరిధిలోని మున్సిపల్ పట్టణాల్లో వరద నీటి కాల్వలు చాలావరకు ఆక్రమణల పాలయ్యాయి. కాల్వలపైనే కొందరు నిర్మాణాలు చేపట్టారు. పూడిక తీయడానికి వీలు లేకుండా కబ్జా చేసేశారు. కాల్వలపై ఆక్రమణలతో వర్షపు నీరు పోయే మార్గాలు లేకపోయినా వాటి తొలగింపునకు కనీస ప్రయత్నాలు జరగడంలేదు. మున్సిపల్ రికార్డుల్లో నమోదైన ప్రకారం కాల్వల విస్తీర్ణం లేదు. కాల్వలను మాయం చేసేలా నిర్మాణాలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో భారీ వర్షాలు కురిస్తే రోడ్లు చెరువులను మరిపిస్తున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని గృహాలు ముంపునకు గురవుతున్నాయి.

నాటక రంగానికి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి

- సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు

భట్టిప్రోలు (కొల్లూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తమవంతు కృషి చేస్తున్నట్లు సినీ రచయిత, సీనియర్ నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రఘుబాబు స్మారక 35వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక, నాటకాల పోటీలు ప్రారంభమయ్యాయి. నాటకాల ప్రారంభోత్సవ సభకు పరుచూరి అధ్యక్షత వహించి, మాట్లాడారు. తన కుమారుడు ఈ గ్రామంలో నడయాడాడని, అతని అకాల మరణం పొందడంతో ఇక్కడ నందమూరి తారక రామారావు కళా ప్రాంగణాన్ని నిర్మించి తన కుమారుడు జీవించే ఉన్నారన్న భావనతో రంగస్థల కళాకారులతో ఏటా నాటకోత్సవాలు ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సినీ నటి శివపార్వతి మాట్లాడుతూ పరుచూరి రవిబాబు రంగస్థల కళాకారుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉన్నారన్నారు. తమ గురువులు పరుచూరి సోదరులు ఏర్పాటు చేసిన నాటకోత్సవాల్లో తనకు అవకాశం కల్పించారన్నారు. తనలా ఎంతో మంది కళాకారులకు పరుచూరి సోదరులు చేయూతనిచ్చారని చెప్పారు. తెలుగు ప్రముఖ రచయిత బుర్రా సాయిమాధవ్ మాట్లాడుతూ నాటక కళను గ్రామీణ ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు. అనేక వ్యయ ప్రయాసాలకోర్చి పెద్ద వయసులో కూడా నాటక రంగానికి జీవం పోస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు అభినందనీయులనికొనియాడారు. హైదరాబాద్ నుంచి నటీనటులను ఈ ప్రాంతానికి తీసుకు వచ్చి కళా రంగంపై మక్కువ కల్పించేందుకు ఆయన చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. తొలుత నాటకోత్సవాల ప్రారంభ జ్యోతి ప్రజ్వలన శివపార్వతి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సినీనటులు సుబ్బరాయశర్మ, వాఖ్యత అయినాల మల్లేశ్వరరావు, సినీ నటుడు పరుచూరి సుదర్శన్, వేజండ్ల బసవపున్నారావు, వేజండ్ల శివరామప్రసాద్, వేజండ్ల సాంబశివరావు, మండవ రామకోటేశ్వరరావు, రాయన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడ చెత్త అక్కడే..



రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

- కంపు కొడుతున్న గ్రామాలు
- జీతాల్లేక పనులు నిలిపేసిన కార్మికులు
- గ్రామాల్లో మూలనపడిన స్వచ్ఛ వాహనాలు

రేపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని వీధులు చెత్తతో నిండిపోయాయి. రోజుల తరబడి చెత్త పేరుకుపోయి ఉంది. స్వచ్ఛభారత్ కార్మికులు జీతాలు అందక విధులకు హాజరు కావడంలేదు. పారిశుధ్య వాహనాలు మూలన పడి ఉన్నాయి. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయి ఉండటంతో పల్లె వీధులు కంపుకొడుతున్నాయి. జిల్లాలోని పలు పంచాయతీల్లో స్వచ్ఛభారత్‌లో వాహనాలు నడిపే డ్రైవర్లకు, స్వీపర్లకు పది నెలలుగా జీతాలు మంజూరు కావడంలేదు. దీంతో వారు పనులు ఆపేయడంతో గ్రామాల్లో పారిశుధ్యం పూర్తిగా అడుగంటింది. జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల, పర్చూరు, అద్దంకి, చీరాల నియోజకవర్గాల పరిధిలో చెత్త సేకరించే వాహనాలు 1800 ఉన్నాయి. ఒక్కో యంత్రానికి ఇద్దరు డ్రైవర్లు, ఇద్దరు స్వీపర్లు ఉన్నారు. మేజర్ పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.10 వేలు, స్వీపర్లకు రూ.6 వేల వేతనాలు ఇవ్వాలి. మామూలు పంచాయతీల్లో డ్రైవర్లకు రూ.8 వేలు, స్వీపర్లకు రూ.6 వేలు ఇవ్వాలి. అయితే పది నెలలుగా వారికి జీతాలు మంజూరు కావడంలేదు. వేతనాలు రాకపోతుండటంతో పనులు చేయలేమంటూ జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్ కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నారు. దీంతో పల్లె వీధులు చెత్తచెదారాలతో పేరుకుపోతుండగా, రూ.లక్షల విలువైన వాహనాలు పంచాయతీ కార్యాలయాలకే పరిమితమయ్యాయి. అసలే ఎండాకాలం కావడం.. వీధుల్లో పేరుకుపోయిన చెత్త కారణంగా దుర్వాసన వెదజల్లి ప్రజలు అల్లాడుతున్నారు. అంటువ్యాధుల బారిన పడుతున్నామంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటింటికి రూ.100 చొప్పున పంచాయతీవారు పన్ను కట్టించుకుంటున్నారని చెత్త ఎత్తడానికి కార్మికులు రావడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది నెలలుగా జీతాలు ఇవ్వడంలేదని కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ప్రశ్నిస్తున్నారు. స్వచ్ఛ భారత్ నుంచి గతంలో నిధులు మంజూరయ్యేవని అయితే గతకొంతకాలంగా రాకపోవడంతో జీతాలు చెల్లింపులు నిలిచినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.



ధూళిపూడిలో మూలనపడిన తడి, పొడిచెత్త ఎత్తే వాహనాలు

కదల్లేని వారికి కార్డులెలా?



సీనియర్ సిటిజన్ కార్డు

- వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డుల కష్టాలు
- సచివాలయాలకు వెళ్తేనే ప్రాసెసింగ్ చేస్తున్న సిబ్బంది
- ఇంటి వద్దనే కార్డు మంజూరు చేయాలంటున్న వృద్ధులు

గుంటూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న సీనియర్ సిటిజన్ కార్డులను పొందలేని పరిస్థితి పలువురు వృద్ధుల్లో నెలకొన్నది. కార్డు కోసం సచివాలయాలకు వెళ్లాల్సి రావడమే ఇందుకు కారణం. వృద్ధుల్లో కొందరు అనారోగ్య సమస్యల దృష్ట్యా నడవలేని వాళ్లు ఉన్నారు. వారు కార్డు కోసం సచివాలయానికి వెళ్లి అక్కడ దరఖాస్తు చేసుకోవాలంటే చాలా ఇబ్బందికరంగా మారింది. అసలే ఎండ తీవ్రత దృష్ట్యా ఉదయం 10 గంటల సమయం దాటిన తర్వాత వృద్ధులు ఇంటి నుంచి అడుగు బయటకు పెట్టలేని పరిస్థితి. ఒకవేళ ఎక్కడికైనా బయటకు వెళ్లి వస్తే వడదెబ్బ బారిన పడుతు న్నారు. గుంటూరు జిల్లాలో 85 ఏళ్ల వయస్సు పైబడి వృద్ధులు దాదాపుగా 17 వేల మంది ఉన్నారు. ఇక బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలోనూ వేల సంఖ్యలో వృద్ధులు ఉన్నారు. గ్రామాలు, కొన్ని పట్టణాల్లో సుదూరంగా సచివాలయాలు ఉన్నాయి. అక్కడ వరకు ఎండల్లో వెళ్లలేక.. కార్డులు పొందలేక వృద్ధులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సచివాలయాల్లో ఉదయం 11 గంటల వరకు సిబ్బంది రావడంలేదు.. ఆ తర్వాత కూడా రకరకాల పనులు, ఫోన్లలో బిజీగా ఉంటున్నారు. ఈ పరిస్థితుల్లో వృద్ధులు ఎండలో అంతదూరం వెళ్లలేక.. వెళ్లినా గంటల తరబడి నిరీక్షంచలేక పోతున్నారు.ఈ పరిస్థితుల్లో సచివాలయాలకు వెళ్లి సీనియర్ సిటిజన్ కార్డులు పొందాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. గత కొన్ని రోజుల నుంచి జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ/వార్డు సచివాలయాల్లో సీనియర్ సిటిజన్ కార్డులను సిబ్బంది మంజూరు చేస్తున్నారు. ఎవరైతే 60 ఏళ్ల వయస్సు దాటిన వృద్ధులు ఆధార్ జిరాక్స్, పాసుపోర్టు సైజు ఫొటో, బ్లడ్ గ్రూపు, ఆధార్ లింక్ మొబైల్ నంబరు తీసుకుని వచ్చిన వారికి దరఖాస్తు ఇచ్చి దానిని పూర్తి చేయించి సచివాలయాల సిబ్బంది ప్రాసెసింగ్ చేస్తున్నారు. దాంతో ఆన్‌లైన్‌లో ప్రభుత్వ లోగోతో సీనియర్ సిటిజన్ కార్డు మంజూరు అవుతున్నది. ఆ కార్డులో వృద్ధుడు/వృద్ధురాలి పేరు, పుట్టిన తేదీ, మాస్క్‌డ్ ఆధార్ నంబరు, సీనియర్ సిటిజన్ కార్డు నంబరు, బార్ కోడ్, చిరునామా, కాంటాక్టు నంబరు, అత్యవసరమైతే సంప్రదించాల్సిన వ్యక్తి పేరు, మొబైలు నంబరు, ఎమర్జన్సీ నంబర్లు పొందుపరిచి ఉంటున్నాయి. ఈ సీనియర్ సిటిజన్ కార్డులు పలు విధాలుగా వృద్ధులకు ఉపయోగపడతాయని అధికారులు చెబుతున్నారు.

కార్డుతో పలు ప్రయోజనాలు..

సీనియర్ సిటిజన్ కార్డులతో బహుళ ప్రయోజనాలున్నాయి. వృద్ధాప్య పింఛన్ పొందాలంటే ఈ కార్డు ఉంటే సరిపోతుంది. ఇందుకు కారణంగా ఈ కార్డులోనే పుట్టిన తేదీ నమోదై ఉంటుంది. అలానే ఆధార్ నంబరు కూడా ఉంటుంది. మిగతా ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందాలన్నా ఉపయోగకరంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సు ప్రయాణాల్లో సీనియర్ సిటిజన్ కార్డు చూపించి టిక్కెట్ చార్జీలో రాయితీ పొందవచ్చు. బ్యాంకుల్లో వృద్ధులకు ప్రత్యేకించి అధిక వడ్డీ చెల్లించే డిపాజిట్ల స్కీమ్‌లకి కూడా ఈ కార్డు ఉపయోగపడుతుంది. ఆస్పత్రుల్లోనూ సీనియర్ సిటిజన్ కార్డు ఉపయోగపడుతుంది. రైల్వే టిక్కెట్ కౌంటర్లలో త్వరితగతిన టిక్కెట్లు బుకింగ్ చేసుకోవచ్చు. ఈ ఉపయోగాల దృష్ట్యా సీనియర్ సిటిజన్ కార్డుకు డిమాండ్ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్లో ఇళ్ల వద్దనే పింఛన్‌ను పంపిణీ చేస్తున్నట్లుగా సీనియర్ సిటిజన్ కార్డులు పంపిణీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు.

ఉత్తమ ప్రదర్శనగా.. కపిరాజు

శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడురోజుల పాటు పోటీలు



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన కపిరాజు నాటిక కళాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, రోటరీ సభ్యులు

మార్టూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): శ్రీకారం రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో మూడు రోజుల నుంచి మార్టూరులో 15వ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలు జరిగాయి. ఇందులో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన నాటికల వివరాలను ఎఫర్ట్ సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు, రోటరీ అధ్యక్షుడు మద్దు మాల కోటేశ్వరరావు ప్రకటించారు. శనివారం రాత్రి నాటికల ప్రదర్శన ముగింపు అనంతరం న్యాయనిర్ణేతలు ఇచ్చిన ఫలితాలను వెల్లడించారు. మొత్తం 9 నాటికలను ప్రదర్శించగా ఉత్తమ ప్రదర్శనగా విజయవాడకు చెందిన న్యూ స్టార్ మోడరన్ థియేటర్ వారు ప్రదర్శించిన 'కపిరాజు' నాటికను ఎంపిక చేశారు. ఈ నాటికకు ఉత్తమ మేకప్, ఇద్దరు ఉత్తమ పాత్రధారులకు ప్రత్యేక బహుమతులు, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ సహాయనటుడు అవార్డులు కూడా దక్కాయి. ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా హైదరాబాద్‌లోని విశ్వశాంతి కల్చరల్ వారు ప్రదర్శించిన స్వేచ్ఛ నాటికను ఎంపిక చేశారు. ఈ నాటికలో ఆనంద్ పాత్రధారి గోవాడ వెంకట్‌కు ఉత్తమ నటుడిగా అవార్డు, ప్రత్యేక బహుమతిగా శ్వేతపాత్రధారి మంజుభార్గవికి దక్కింది. తృతీయ ఉత్తమ ప్రదర్శనగా కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన 'రుతువు లేని కాలం' నాటిక ఎంపికైంది. అదేవిధంగా ఈ నాటికలో రచయిత అగస్త్య, హాస్యనటుడుగా సురేంద్రబాబు, నటి సురభిపూజితకు అవార్డు దక్కింది. వారందరికీ జ్ఞాపికలతో పాటు నగదు బహుమతిని నిర్వాహకులు ప్రదానం చేశారు. న్యాయనిర్ణేతలుగా అంబటి మురళీకృష్ణ, అన్నమనేని ప్రసాదరావు, కేవీ మంగారావు వ్యవహరించారు. ఈ కార్యక్రమాలను ఎం.ఈశ్వరప్రసాద్, జాష్టి సాంబశివరావు, శానంపూడి లక్ష్మయ్య, జయరావు, షేక్ ఖాజాహుస్సేన్ తదితరులు పర్యవేక్షించారు.

అవీ..ఇవీ..

చికెన్ ధరలో తగ్గుదల



చికెన్ దుకాణం వద్ద పెద్ద ఎత్తున ఉన్న కొనుగోలుదారులు

అద్దంకి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): చికెన్ ధరలు హెచ్చుతగ్గులుగా ఉన్నాయి. బర్డ్‌ఫ్లూతో కోళ్లు మృతి చెందుతున్న సమయంలో చికెన్ అమ్మకాలు పూర్తిగా తగ్గాయి. అనంతరం క్రమేపి మరోసారి అమ్మకాలు ఊపందుకున్నాయి. గత నెలలో అద్దంకి లో చికెన్ ధర కిలో 100 రూపాయలు ఉండగా క్రమేపి పెరుగుతూ వారం రోజుల క్రితం ధర రూ.200లకు చేరింది. ప్రస్తుతం మరలా రూ.160కి తగ్గింది. ఇలా చికెన్ ధర రోజుకో రేటుతో నడుస్తుంది. ఆదివారం కావడం, ధర కూడా పెరిగి తగ్గడం తో అద్దంకిలో చికెన్ దుకాణాల వద్ద కొనుగోలు దారులు పెద్ద సంఖ్యలో బారులు తీరారు. బల్లికురవలో కిలో చికెన్ రూ.150 రూపాయలకే అమ్మకాలు చేశారు. దీంతో సాధారణ అమ్మకాల కంటే 20 శాతం మేర అమ్మకాలు పెరిగినట్లు సమాచారం.

1 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

బల్లికురవ. ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వి.కొప్పెరపాడు గ్రామంలో మే ఒకటో తేదీ నుంచి జిల్లాస్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 30వ తేదీ లోపు పోటీల్లో పాల్గొనే జట్లు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని ఎంట్రీ ఫీజురూ.500 చెల్లించాలన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 20,116, రెండో బహుమతిగా రూ. 15, 116, మూడో బహుమతిగా రూ. 10,116, నాలుగో బహుమతిగా రూ. 5, 116, నగదు బహుమతులను అందజేస్తామని మరిన్ని వివరాలకు 7036938516, 6305006862, 9705200374 నెంబర్లను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

చీరాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి చీరాల శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని 6 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకురాలు ధనమ్మ తెలిపారు. శిబిరంలో డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డాన్స్, క్యారమ్స్ వాటిపై అవగాహన కల్పిస్తారని వివరించారు. అలాగే శిక్షణ అందించేందుకు అనుభవం గల ఫ్యాకల్టీలు సహకరించాలని కోరారు.

అద్దంకిలో అన్నదానం

అద్దంకి,ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): అఖిలభారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి, స్వామి సత్య సైన్య సేవాసమితిల ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా ఆదివారం అద్దంకి పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద అన్నదానం నిర్వహించారు. అన్నదానానికి కోవి శ్రీనివాసరావు, లక్ష్మీసుజాత సహకరించారు. కార్యక్రమంలో అయ్యప్పదీక్ష ప్రచార సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు గురుస్వామి, ప్రకాశం జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతిరెడ్డి గురుస్వామి, కొండ్రగుంట శ్రీనివాసరావు, ఆకుల పెద్దన్న, పల్లా నాగేశ్వరరావు, మంగమూరు సురేష్, సు బ్రహ్మణ్యం, వేదాంత్, సాయికృష్ణ పాల్గొన్నారు.

పాతపుస్తకాల సేకరణ



సేకరించిన పాత పుస్తకాలతో ప్రతినిధులు, విద్యార్థులు

చీరాల, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : సృష్టిలో అన్నీ అవసరమేనని, వాటి ద్వారా ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చో గుర్తించడమే అతిపెద్ద విజయమని పలువురు వక్తలు అన్నారు. గీతా యంగ్ సైంటిస్ట్ అండ్ రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల వారి ఆధ్వర్యంలో ఆదివారం వస్తుమార్పిడి కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో కొన్ని రోజులుగా సుమారు 130 మంది విద్యార్థుల నుంచి 1800 కిలోల పాత పుస్తకాలు, దినపత్రికలు, ప్లాస్టిక్ వస్తువులు సేకరించారు. అందుకు సంబంధించి రూ.21 వేల విలువైన నూతన పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, వివిధ రకాల పరికరాలను విద్యార్థులకు అందజేశారు. అంతేకాకుండా 50 కిలోల బరువు గల పాత పుస్తకాలు అందించిన వారికి ప్రత్యేక బహుమతి అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వస్తు మార్పిడి వలన అవసరమైన వస్తువులు అందుకోవడమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు పాటు పడవచ్చని వివరించారు. కార్యక్రమంలో వలివేటి మురళీకృష్ణ, డా.ఐ. బాబురావు, బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, కిరణ్, పద్మ, సుధ, నవీన్, రీఫాత్, బాజీ, రాఘవరావు, కృష్ణ, కృష్ణమూర్తి, గురు ప్రసాద్, ప్రసాద్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.


అనంతవరం చెరువులో పూడికతీత



పనులు ప్రారంభిస్తున్న బాలవికాస సంస్థ ప్రతినిధులు

యద్దనపూడి,(మార్టూరు)ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి):బాలవికాస సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫిలిఫ్‌మొర్రీస్ ఇంటర్నేషనల్ గాడ్‌ఫ్రే ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో ఆదివారం యద్దనపూడి మండలం అనంతవరం గ్రామంలో చెరువు పూడికతీత కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమాన్ని గ్రామ టీడీపీ నాయకులు గుదే తారకరామారావు ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎఫర్ట్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ జాష్టి వెంకటమోహనరావు, జీపీఐ మేనేజరు ఉమమహేష్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఉమమహేష్ రైతులతో మాట్లాడుతూ చెరువు పూడికతీయడం వలన చాలా లాభాలు ఉన్నాయన్నారు. చెరువులోతు పెరగడం ద్వారా, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. దానితో పాటు భూగర్భజలాలు పెరుగుతాయన్నారు.అంతేగాకుండా ఈ పూడికమట్టిని రైతులు పంటపొలాల్లో వినియోగించుకోవచ్చన్నారు. తద్వారా పొలాల్లో తేమశాతం పెరుగుతుందన్నారు. ఒకసారి పూడిక మట్టిని పొలంలో వేసినట్లయితే దాని ప్రతిఫలం 4 ఏళ్ల వరకు ఉంటుందన్నారు. రైతులకు బాల వికాస సంస్థ ఉచితంగా ప్రొక్లయిన్‌తో పూడిక మట్టిని తరలిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కో ఆ ర్డినేటర్ బుర్ర విక్రమ్, పి.రాజ్‌కుమార్ రైతులు, కొరటాల వంశీకృష్ణ, పోపూరి వెంకట్రావు, పోపూరి సాంబశివరావు,పెదవల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయస్వామికి కదళీఫలార్చన



ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా ఆదివారం 10 వేల అరటిపండ్లతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రాతఃకాల సుప్రభాతం, గోపూజ, బిందె తీర్థం అనంతరం స్వామి వారికి అభిషేకము నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, ఉభయదాతలు ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు 11 ఆవృత్తములుగా దశసహస్ర కదళీఫల పూజ నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వీర్లచెరువు భూమి ఆక్రమణకు యత్నం

- ఎక్స్‌కవేటర్‌తో చెరువులో రోడ్డు నిర్మాణం
- పనులను అడ్డుకొన్న రైతులు

బల్లికురవ. ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సాగునీరు అందించే వీర్లచెరువు భూమిపై కన్నేసిన అక్రమార్కులు గుట్టు చప్పుడు కాకుండా యంత్రాలను ఏర్పాటు చేసి గ్రానైట్ క్వారీ ఏర్పాటు చేసేందుకు రోడ్డును ఏర్పాటు చేస్తున్నారు. చెరువులో రోడ్డు వేస్తున్నారని తెలిసిన నక్కబొక్కలపాడు గ్రామ నీటి సంఘం అధ్యక్షులు దర్శి రామస్వామి, రైతులతో కలిసి వెళ్లి పనులను అడ్డుకొన్నారు. అసలు రోడ్డు ఎవరు వేయమన్నారు..? అని అడిగితే ఒంగోలుకు చెందిన ఒక వ్యక్తి పనులు చేయించాలని తనకు చెప్పారని అక్కడ ఉన్న సూపైర్‌వైజర్ రైతులతో చెప్పి, పనులు నిలిపి వేసి పక్కకు వెళ్లిపోయారు. చెరువు భూమిలో పనులు ఎలా చేస్తున్నారని అక్కడ రోడ్డు పనులు చేయిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేసి పనులను నిలుపుదల చేయించారు. తాము ఎగువ భాగంలో గ్రానైట్ క్వారీ లీజ్ పొంది ఉన్నామని అందుకే రోడ్డు వేస్తున్నా మని చెప్పగా ప్రభుత్వ చెరువులో రోడ్డు ఏర్పాటుకు ఎవరు అనుమతులు ఇచ్చారో తగు పత్రాలు చూపాలని రైతులు కోరారు. బల్లికురవ నుంచి చెన్నుపల్లి వెళ్లే రోడ్డులో తారు రోడ్డు ఆనుకొని చెరువు మధ్య వరకు మట్టి రోడ్డు వేశారని ఈ రోడ్డు వేయడం వలన రానున్న కాలంలో రైతులకు తీవ్ర ఇబ్బంది ఉంటుందని వారు తెలిపారు. ఈ రోడ్డు అనుమతులు ఇచ్చిన వారిపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. సోమవారం తహసీల్దార్‌కు పిర్యాదు చేస్తామని రైతులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అధికారులు వచ్చే వరకు పనులు చేపడితే పోలీసు స్టేషన్‌కు ఎక్సకవేటర్ తరలిస్తామని రైతులు హెచ్చరించారు.



పనులను అడ్డుకుంటున్న స్థానికులు



రోడ్డు వేసేందుకు కట్టపోస్తున్న ఎక్స్‌కవేటర్

దివ్యశ్రీకి ఘన సత్కారం

పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో రెండో స్థానంపై హర్షం

వేటపాలెం(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే పట్టుదలతో దృష్టిసారిస్తే ఉన్నత శిఖరాలు అందుకోవచ్చని పలువురు ఉపాధ్యాయులు, వక్తలు అన్నారు. ఇటీవల విడుదలైన పదోతరగతి ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి వేటపాలెం మండలం పందిళ్లపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించారు. రాష్ట్రంలో రెండవ స్థానం నిలిచి, జిల్లాలో మొదటిస్థానం దక్కించుకున్నారు. ఈక్రమంలో ఆదివారం పాఠశాల ఉపాధ్యాయులు ఆమె ఇంటికి చేరుకొని స్వీట్లు తినిపించారు. భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని ఆకాం క్షించారు. అలాగే మరి కొంత మంది విద్యార్థుల నివాసాలకు వెళ్లి అభినందించి, స్వీట్లు అందజేశారు. అంతేకాకుండా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం నాయకులు దేవల మనుబ్రహ్మ పందిళ్లపల్లి, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట, ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు, నగదు ప్రోత్సాహం అందజేశారు.



దివ్యశ్రీకి స్వీట్లు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

ప్రతిభావంతులకు ప్రోత్సాహం

చినగంజాం : ఇటీవల ప్రకటించిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోపిరాల గ్రామ పెద్దలు అభినందించారు. చిన గంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని సోపిరాల గ్రామంలో వేంచేసిన శ్రీ హరిహర సుత అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగ ణంలో ఆలయ కమిటీ ఛైర్మన్, మాజీ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ టీఎస్ఆర్.ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సభ ఆదివారం నిర్వహించారు. ఈ సభలో సోపిరాల గ్రామంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 520 మార్కులు పైన సాధించిన 33 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన కుర్రి సుబ్బారావు, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు ఒక్కొక్క విద్యార్థికి రూ.1000లు, రిటైర్ట్ కెనరా బ్యాంకు మేనేజర్ తుమ్మలపెంట సుబ్బారావు రూ.500లు, రిటైర్డ్ పీ.డీ. ఏడుగుండ్ల నాగేశ్వరరావు రూ.500లు, రిటైర్డ్ ఈఈ.కుర్రి రామసుబ్బారావు, టీఎస్ఆర్.ఆంజనేయులు జనరల్ నాలెడ్జ్, డిక్షనరీ, రిఫరెన్స్ పుస్తకాలను అందజేసి, శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. విద్యార్థులు విద్యలో రాణించి, ఉన్నత శిఖరాలకు ఎదగాలని గ్రామ పెద్దలు ఆకాంక్షించారు. అనంతరం సోపిరాల గ్రామ పెద్దలు టీఎస్ఆర్.ఆంజనేయులని ఘనంగా సన్మానించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న సోపిరాల గ్రామ పెద్దలు

కంటి సంరక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలి

పంగులూరు,ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి వ్యక్తి కంటి సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటించాలని శంకర్ కంటి వైద్యశాల నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ చిన్మయి సూచించారు. పంగులూరు రోటరీక్లబ్ ప్రాంగణంలో శంకర్ నేత్రాలయ, పెదకాకాని వారు రోటరీ క్లబ్ ఆఫ్ పంగులూరు వారి సహకారంతో ఆదివారం ఉచితనేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 174 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 117 మందికి శుక్లాల శస్త్రచికిత్సలు అవసరంగా గుర్తించారు. ఆదివారం ప్రత్యేక బస్సులో 45 మందిని శస్త్ర చికిత్స కోసం శంకర్ నేత్రాలయకు తరలించినట్లు క్లబ్ కార్యదర్శి బత్తుల వీరనారాయణ, క్యాంప్ ఇన్‌చార్జ్ వీరరాఘవయ్య తెలిపారు. మిగిలిన 72 మందిని ఈ నెల 29న ప్రత్యేక వాహనంలో శంకర్ నేత్రాలయానికి తరలించి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షులు షేక్ కాలేషావలి, వైద్యశాల ప్రతినిధి గంగాధర్, రోటరీ ప్రతినిధులు వెంకట రామారావు, పోతిన ప్రసాద్, ఆర్‌వీ. సుబ్బారావు, శంకర్ నేత్రాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పంగులూరులో సూచనలు చేస్తున్న కంటివైద్యులు

వృద్ధులకు ఉచిత కంటి వైద్యశిబిరం

అద్దంకి : మండలంలోని మణికేశ్వరంలో ఒంగోలు యామిని కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. 67 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అద్దంకి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, ఈసువలి, మౌలాలి, బడావలి, అశోక్, మాధ్యూన్, నాగయ్య, రవీంద్ర, రవి, రూబేను తదితరులు పాల్గొన్నారు.

కరివేపాకు ధర తీసికట్టు

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): కరివేపాకు ధర రోజురోజుకు తీసికట్టుగా మారుతోంది. రెండు, మూడు నెలల క్రితం కిలో రూ.20 ఉండగా, ప్రస్తుతం ఒక్కసారిగా ధరలు తగ్గాయి. ప్రస్తుతం రూ.2కు పడిపోయింది. దీంతో సాగుచేసిన రైతులకు కనీసం పెట్టు బడులు కూడా వచ్చే పరిస్థితి కూడా లేకుండా పోయింది. అద్దంకి ప్రాంతంలో కూరగాయలు, ఆకు కూరల సాగు ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో పలువురు రైతులు కరివేపాకు సాగు కూడా చేపట్టారు. అయితే జనవరి ఫిబ్రవరి నెలలలో కిలో కరివేపాకు ధర రూ.20 ఉండగా ఒక్కసారిగా రూ.2కు పడిపోయింది. దీంతో కనీసం కోత ఖర్చులకు కూడా వచ్చే అవకాశం లేకుండా పోయింది. దీంతో కొంత మంది రైతులు పొలంలోనే వదిలి వేస్తున్నా రు. డబ్బులు లేకుండా కోసుకొని వెళ్ళమన్నా వ్యాపారులు ముం దుకు రావడం లేదని పలువురు రైతులు వాపోతున్నారు. దీంతో కొందరు రైతులు సాగు చేసిన కరివేపాకు పొలం ను దున్ని వేస్తున్నారు. మరి కొందరు రైతులు అయితే పెంచిన మొక్కలను దున్ని వేయలేక నష్టం అయినా భరించి వచ్చిన కాడికి అమ్ముకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ధరలు తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కరివేపాకు సాగు చేసి కరివేపాకుగా మారామని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కోత ఖర్చులు కూడా రావడం లేదు

పెట్టుబడులు పెట్టిపెంచిన కరివేపాకు కోతదశకు వచ్చే సరికి ధర ఉండడం లేదు. కనీసం కోత కూలీ కూడా రావడం లేదు. ఎకరాకు సుమారు రూ.30 వేల వరకు పెట్టుబడి అయ్యింది. రెండు నెలల క్రితం వరకు కిలో రూ.20 ఉండగా ప్రస్తుతం రూ.2లకు కూడా కొనుగోలు చేయడం లేదు. **లక్ష్మీప్రసాద్, రైతు**



చక్రాయపాలెం వద్ద సాగు చేసిన కరివేపాకు పొలం

శింగరకొండలో రాతి మండపం నిర్మాణానికి విరాళం

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి పలువురు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. అద్దంకి పట్టణంలోని కాకానిపాలేనికి చెందిన కాకాని హనుమంతరావు జ్ఞాపకార్థం కుమార్తెలు మేడా రాధిక, భీమని విజయలక్ష్మిలు రూ.1,01,116 చొప్పున తమ సోదరుడు టీడీపీ అద్దంకి పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాకాని అశోక్ ద్వారా అందజేశారు. పంగులూరు మండలం ముప్పవరానికి చెందిన దూళిపాళ్ల రామచంద్రప్రసాద్, నాగేశ్వరి దంపతులు రూ.1,00,116 ఈఓ తిమ్మానాయుడు కు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత వడ్డవల్లి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న అద్దంకి పట్టణ టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్

అంగరంగ వైభవంగా గంగమ్మ తిరునాళ్ల

- అశేష భక్తుల నడుమ శిడిమానోత్సవం
- మొక్కులు తీర్చుకున్న భక్తులు

కారంచేడు (పర్చూరు), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) : అంగరంగ వైభవంగా మండల కేంద్రమైన కారంచేడు గ్రామంలో వేంచేసిన గంగమ్మ తిరునాళ్ల ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుండి పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పాడిపంటలు వృద్ధి చెందాలని గ్రామం సుభిక్షంగా ఉండాలని పిల్లలు, పెద్దలు అమ్మవారిని వేడుకొని మొక్కులు తీర్చుకున్నారు. తిరునాళ్ల సందర్భంగా ప్రతి ఏటా అమ్మవారి ఆలయం వద్ద నిర్వహించే శిడిమహోత్సం భక్తులను ఎంతగానో అలరించింది.. వేడుకలను తిలికించేందుకు గ్రామ నలుమూల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావటంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. తిరునాళ్ళ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వయువకులు, చిన్నారుల కేరింతలతో ఆలయ ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది.







గాజుల అలంకరణలో గంగమ్మ, మేళతాళాలతో వస్తున్న శిడి పెండ్లికొడుకు, ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ



భారీగా తరలి వచ్చిన భక్తుల నడుమ శిడిమహోత్సవం

భారీ బందోబస్తు...

తిరునాళ్ల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చీరాల డీఎస్పీ మహమ్మద్ మోయిన్ ఆధ్వర్యంలో ఇంకొల్లు సీఐ వై.వీ. రమణయ్య నేతృత్వంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు. ఇంకొల్లు ఎస్సై సురేష్, చినగంజాం ఎస్సై రమేష్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పహల్గాం దాడికి నిరసనగా ర్యాలీ



వేటపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వ్యాపారులు

వేటపాలెం (చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఉగ్రవాదులదాడిలో అమాయక పర్యాటకులు మృతిచెందడం అన్యాయ మని వేటపాలెం జీడిపప్పు ఉత్పత్తిదారులు, కిరాణా, ఫ్యాన్సీ ప్రముఖ వ్యాపారులు అన్నారు. ఆదివారం వేటపాలెం ప్రధాన కూడళ్లలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ సుబ్బరాజు అన్నారు. అద్దంకి పట్టణంలోని కలవకూరు క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులను ఆపి సీఐ సుబ్బరాజు కౌన్సిలింగ్ నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అపరాధ రుసుము విధించటం జరుగుతుందన్నారు. ప్రమాద సమయంలో హెల్మెట్ రక్షణగా నిలిచి ప్రాణాలు కాపాడుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

అక్కయ్యపాలెం(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందిన ఘటన చీరాల వేటపాలెం మధ్య చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం చీరాల కొత్తపాలెం చెందిన రాజు కృష్ణారెడ్డి(55) శనివారం రాత్రి వేటపాలెం నుండి చీరాల వైపు మోపెడ్‌పై వస్తున్నాడు. ఆయన వాహనాన్ని ఒంగోలు వైపు వెళుతున్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఈ మేరకు వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్ట్‌మార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రేపు నూతలపాడు పోలేరమ్మ తిరునాళ్ల

నూతలపాడు(పర్చూరు), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండల పరిధిలోని నూతలపాడు గ్రామంలో వేంచేసిన గ్రామ దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి తిరునాళ్ళ ఈనెల 29న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో శిడిమహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సివిల్ సర్వీస్ రూల్స్-1972 సవరణ చట్టాన్ని రద్దుచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు రామారావు

మార్టూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ రూల్స్-1972 సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మార్టూరు యూనిట్ సభ్యులు తీర్మానించారు. ఆదివారం మార్టూరులో విశ్రాంత ఉద్యోగుల భవనంలో మార్టూరు యూనిట్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కె రామారావు, కార్యదర్శి చిట్టిబాబులు మాట్లాడుతూ సవరణ చట్టం వలన విశ్రాంత ఉద్యోగులకు తీరని నష్టం జరుగుతున్నదన్నారు. సీనియర్ సిటిజన్లుకు నష్టం కలిగించే పనులు మంచి వికావని, ఈ చట్టాన్ని రద్దు చేయాలని సభ్యులు తీర్మానం చేస్తున్నట్లు ప్రకటించారు. అదేవిధంగా చట్టసవరణ విశ్రాంత ఉద్యోగుల పాలిట ఆశనిపాతమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా-2 అధ్యక్షులు రావుల బాపయ్య, ఎం.పిచ్చయ్యశర్మ, కే.లక్ష్మయ్య, యూనిట్ నాయకులు పీవీ.శివరామకోటేశ్వరరావు, అంకయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు, తదితర సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలకు పరిష్కారం

- సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం




పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు, టీడీపీ కూటమి నాయకులు

వాడరేవు(చీరాల), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంటేనే పేదింటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పలువురు మత్స్యకారులు, టీడీపీ కూటమి నాయకులు పేర్కొన్నారు. శనివారం మత్స్యకారుల భృతి అందుకున్న నేపథ్యంలో ఆదివారం వాడరేవు మత్స్యకార యార్డు వద్ద సీఎం నారా చంద్రబాబునాయుడు, ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. 'థాంక్యూ సీఎం' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కౌతవరపు జనార్ధనరావు, మాజీసర్పంచ్ ఎరిపిల్లి రమణ, పిక్కి కోదండం, రామకృష్ణ, విజయ్, చిన్నారావు, గురన్న, అప్పారావు, శ్రీను, ఏసోబు, మహేష్‌బాబు, బుల్లియ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
సోమవారం 28 ఏప్రిల్ 2025



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	37.5	27.6
కావలి	35	27
ఆత్మకూరు	38	27
ఉదయగిరి	38	26
కందుకూరు	36	27

భారీగా పెరిగిన డిమాండ్

వైసీపీ పాలనలో తీసుకువచ్చిన కొత్త విధానం కారణంగా దాదాపుగా మున్సిపాలిటీల ఆస్తిపన్ను డిమాండ్ 50 శాతానికి పైగా పెరిగింది. నెల్లూరు కార్పొరేషన్ విషయానికి వస్తే 2019-20 ఆర్థిక సంవత్సరం డిమాండ్ రూ. 82.22 కోట్లు కాగా, కొత్త పన్ను విధానం అమలులోకి వచ్చిన తొలి సంవత్సరం(2020-21) 97.85 కోట్లకు పెరిగింది. ఆ ఒక్క సంవత్సరమే రూ. 15 కోట్లు పెరిగింది. ఇక అప్పటి నుంచి ప్రతి ఏటా డిమాండ్ పెరుగుతూనే వస్తోంది. 21-22 ఆర్థిక సంవత్సరం 98.34 కోట్లు, 22-23వ సంతవ్సరం 116.28 కోట్లు, 2024-2025 ఆర్థిక సంవత్సరం 130.22 కోట్లకు పెరిగింది. అసెస్‌మెంట్లు భారీగా పెరిగాయి కాబట్టి డిమాండ్ పెరిగిందని అనుకోవడానికి వీలులేదు. ఎందుకంటే నెల్లూరు కార్పొరేషన్‌లో ఈ ఐదేళ్లలో పెరిగిన అసెస్‌మెంట్లు 9వేలు మాత్రమే.

● కావలి మున్సిపాలిటీలో 2019-20వ సంవత్సరం డిమాండ్ రూ. 11.81 కోట్లు కాగా, 2024-25వ సంవత్సరం డిమాండ్ రూ.20.62 కోట్లు. అంటే ఇక్కడ ఆస్తి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది.

● కందుకూరు మున్సిపాలిటీలో 2019-20వ సంవత్సరం డిమాండ్ రూ. 4.75 కోట్లు కాగా, 2024-2025వ సంవత్సరానికి 9.20 కోట్లుకు పెరిగింది. ఇక్కడ కూడా ఆర్థి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఈ పన్ను భారం మరో రెండు శాతం పెరగనుంది.

ఆస్తి పన్నుల డిమాండ్ ఇలా...


ఆర్థిక సంవత్సరం	అసెస్‌మెంట్లు (రూ.లక్షల్లో)	డిమాండ్ మొత్తం (రూ, కోట్లల్లో)
నెల్లూరు కార్పొరేషన్‌లో		
2020-21	1.26	97.95
2021-22	1.27	98.34
2022-23	1..31	116.28
2023-24	1.33	112.52
2024-25	1.37	130.22
కావలి మున్సిపాలిటీలో		
2018-19	13612	12.15
2019-20	23653	11.82
2020-21	24040	13.66
2021-22	24374	14.46
2022-23	25065	18.30
2023-24	25323	19.29
2024-25	25618	20.62
కందుకూరు మున్సిపాలిటీలో		
2020- 21	14930	6.48
2021- 22	15120	6.52
2022- 23	15368	7.001
2023- 24	15428	7.24
2024- 25	15571	9.20
ఆత్మకూరు మున్సిపాలిటీలో		
2020 - 21	7897	2.08
2021 - 22	7897	2.11
2022 - 23	8187	2.30
2023 - 24	8384	2.38
2024 - 25	8582	2.72
2025 - 26	9020	2.97

వైసీపీ పాపం పట్టణ వాసులకు శాపం

తడిసి మోపెడు అవుతున్న ఆస్తి పన్ను

● నాటి పాలనలో ఏటేటా పన్ను పెంపు ప్రారంభం
● ఐదేళ్లలో రూ. 60 కోట్లకుపైగా భారం
● పేద, మధ్యతరగతి వర్గాలపై ఇంటి అద్దె భారం
● చెత్త పన్నులా ఈ విధానాన్ని ఎత్తేయాలి

నెల్లూరు, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖజానా నింపడం కోసం గత వైసీపీ ప్రభుత్వం పెంచిన పన్నుల భారం నేటికీ పట్టణవాసులను వేధిస్తోంది. ప్రతి ఏటా పన్ను పెంపు విధానం పట్టణాల్లో ఇంటి అద్దెలను అమాంతం పెంచేస్తోంది. పరోక్షంగా ఈ ప్రభావం సొంతిల్లు లేని పేద, మధ్య తరగతి ప్రజలపై పడుతోంది. గతంలో నాలుగైదు ఏళ్లకు ఒకసారి పెరిగే అద్దె, వైసీపీ ప్రభుత్వం పుణ్యమా.. అని 2020-21 నుంచి ప్రతి ఏటా పెరుగుతోంది. జీతాలు, ఆదాయం పెరగక పోగా, నిత్యావసరాల ధరలు



ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ నేపథ్యంలో పేదలకు ఇంటి అద్దె పెంపు అదనపు భారంగా మారింది. గత పాలకులు ప్రభుత్వం విధించిన చెత్త పన్ను లాంటి చెత్త విధానాలకు చెల్లుచీటి పలికిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం, ఆస్తి పన్ను విషయంలోనూ కాస్త ఆలోచించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

● కొత్త విధానంతో చిక్కులు

అద్దె విలువ ప్రామాణికంగా ఆస్తి పన్ను వసూళ్లు చేసే విధానం అమలులో ఉండేది. అయితే వైసీపీ ప్రభుత్వం 2020-21 నుంచి ఆస్తి పన్ను విధింపులో కొత్త విధానాన్ని తీసుకువచ్చింది. ఆయా ప్రాంతాల్లో భూముల రిజిస్ట్రేషన్ విలువ ఆధారంగా ఆస్తి పన్ను నిర్ణయించి, దానిపై ప్రతి ఏటా రెండుశాతం పన్ను పెంచుతూ వెళ్లే విధానాన్ని అమలుల్లోకి తెచ్చింది. ఈ విధానం కారణంగా 2020-21 నుంచి 2025-26 ఆర్థిక సంవత్సరం వరకు ఆస్తి పన్ను దాదాపుగా రెట్టింపు అయింది.

● ఉదాహరణకు నెల్లూరు నగరంలోని 41వ డివిజన్ పరిధి మనుమసిద్ధి నగర్‌లో 18 అంకణాల్లో నిర్మించిన బీ +1 భవనానికి 2019-20లో అద్దె ప్రాతిప్రదికన ఉన్న లెక్క ప్రకారం ఇంటి పన్ను రూ. 1,771లు వస్తుండగా, అప్పుడే అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం 2021లో తీసుకువచ్చిన రిజిస్టేషన్ విలువతో ఇంటి పన్ను పెంచే విధానంతో రూ. 2,031లుకు చేరింది. అది కాస్త ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఏకంగా రూ. 3,499లకు పెరిగింది.

● అలాగే నెల్లూరు రూరల్ పరిధి రెండువ డివిజన్ అల్లీపురం వద్ద 950 చ.అ విస్తీర్ణంలోని అపార్టుమెంట్ ప్లాటుకు 2018-19లో రూ. 479లు మాత్రమే అద్దె ప్రాతిపదిక ఇంటి పన్ను వస్తుండగా, 2021లో రూ. 551లకు పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏకంగా రూ. 964లుకు చేరింది. ఇదీ ఆరు మాసాల ఇంటి పన్ను మాత్రమే. పై రెండు ఉదాహరణలను గమనిస్తే.. ఐదేళ్ల లో ఇంటి పన్ను రెట్టింపు అయింది.

పెరిగిన అద్దెల భారం

2019-20 నుంచి 2024-25వ ఆర్థిక సంవత్సరం వరకు నెల్లూరు కార్పొరేషన్‌లో డిమాండ్ 50 కోట్ల మేర పెరిగింది. జిల్లా పరిధిలోని కావలి, కందుకూరు, ఆత్మకూరు మున్సిపాలిటీల్లో మరో రూ.13 కోట్ల మేర పన్ను భారం పెరిగింది. అంటే మొత్తం నెల్లూరు కార్పొరేషన్, మూడు మున్సిపాలి టీలను కలుపుకుంటే రూ. 63 కోట్ల భారం పెరిగింది. పరోక్షంగా ఇంత కు రెట్టింపుభారం అద్దె కుటుంబాలపై పడింది. ఆస్తి పన్ను పెరిగిన క్రమం లో ఇంటి అద్దెలు విపరీతంగా పెంచేశారు. 2019కి పూర్వం రెండు మూడు ఏళ్లకు పదిశాతం అద్దె పెంచడం ఆనవాయితీగా ఉండేది. ఎప్పుడైతే ప్రతి ఏటా ఆస్తిపన్ను పెంచడం ప్రారంభం అయిందో.. అప్పటి నుంచి అద్దె కూడా ప్రతి ఏటా పెంచడం మొదలయింది. ప్రతి ఏటా కనిష్ఠంగా రూ. 500 నుంచి రూ.1000 వరకు అద్దె పెంచుతున్నారు. బతుకు తెరువు కోసం, పిల్లల చదువు, ఉద్యోగ రీత్యా పట్టణాల్లో అద్దె ఇళ్లను ఆశ్రయించిన పేద, మధ్య తరగతి ప్రజలపై అద్దె భారం మోయలేనంతగా పెరిగింది. ఇదేమని అడిగితే గృహ యజమానులు పన్నుల లెక్క చెబుతున్నారు.

చెత్త పన్నులా తొలగించాలి

గత వైసీపీ ప్రభుత్వం విధించిన చెత్త పన్నును కూటమి ప్రభుత్వం తొలగించింది. దీంతో ప్రజల హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీల ఆదాయం ఆయా మున్సిపాలిటీలకే చెందేలా నిర్ణయం తీసుకుంది. దీనివల్ల మున్సిపాలిటీలకు స్వయం ప్రతిపత్తి ఇచ్చినట్లైంది. అలాగే ఆస్తి పన్ను విషయంలోనూ కూటమి ప్రభుత్వం కాస్త ఆలోచించాలని, పాత విధానాన్ని కొనసాగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. అలా కాని పక్షంలో ప్రతి ఏటా రెండు శాతం పన్ను పెంచే విధానంలోనైనా కాస్త మార్పు తీసుకురావాలని వారు కోరుతున్నారు. పన్ను భారం తగ్గించడం లేదా ప్రతి ఏటా పెరుగుదలను నియంత్రించడం ద్వారా తమను ఆదుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మార్గదర్శి - బంగారు కుటుంబంలో
భాగస్వాములు కండి

నెల్లూరు (హరనాధపురం) ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పేదరికంలేని సమాజం కోసం ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మార్గదర్శి- బంగారు కుటుంబం పథకంపై ఆసక్తి ఉన్నవారు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన ఈ పథకం గురించి టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారు లక్ష కుటుంబాలకు పీ4లో సహాయం అవసరం ఉన్న కుటుంబాలుగా గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, ధనికులు, సేవాభావం కలిగినవారు ఈ పథకంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో ప్రతిశాఖ కనీసం 10 మందిని ఈ పథకంలో భాగస్వాములయ్యేటట్లు చూడాలన్నారు. ఎవరినీ బలవంతంగా ఈ పథకంలో చేర్చవద్దని చెప్పారు. పేద కుటుంబాలను పేదరికం నుంచి బయటకు తీసుకురావడానికి, ఆ కుటుంబాలను దత్తత తీసుకోవడం, వారికి మార్గదర్శకులుగా ఆర్థిక సహకారం అందించడం, వ్యాపారాల కోసం రుణాలు ఇప్పించడం, యువతకు కెరీర్ గైడెన్స్ అందించడం, కుటుంబ అవసరాలను గుర్తించి ఆర్థిక సహాయం అందించడం తదితరాలు చేయాలన్నారు. పేదలతో అనుబంధం పెంపొందించుకోవడం ద్వారా సేవలందించవచ్చని వివరించారు. సీఎం నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ఈ పథకంలో అవకాశం, ఆసక్తిఉన్న ప్రతిఒక్కరూ భాగస్వాములై పేదరికం నుంచి జిల్లాను విముక్తి చేయాలని కలెక్టర్ కోరారు.


కలెక్టర్ ఆనంద్

స్టార్ హోటళ్లలో
బార్లకు ఫీజు తగ్గింపు

● టూరిజం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం నిర్ణయం
● త్వరలోనే ఉత్తర్వుల జారీ

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టూరిజం అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం త్రీస్టార్స్, ఆపై స్టార్లున్న హోటళ్లలో బార్ల ఏర్పాటుకు నాన్‌రీఫండబుల్ ఫీజును భారీగా తగ్గించనున్నది. ఇందుకు సంబంధించి త్వరలోనే ఉత్తర్వులు జారీ చేయనుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో త్రీస్టార్స్, ఆపై స్టార్స్ ఉన్న హోటళ్లలో బార్లు ఏర్పాటు చేసుకునేందుకు నాన్ రీఫండబుల్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 లక్షలుగా నిర్ణయించింది. ప్రతి ఏటా కొంత శాతం ఫీజు పెంచేలా జీవోను విడుదల చేసింది. ఈ క్రమంలో వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన లైసెన్స్ ఫీజు ఈ ఏడాది రూ.70 లక్షలకు చేరింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశంలోనే మన రాష్ట్రంలో హోటళ్లలోని బార్లకు రిజిస్ట్రేషన్ చార్జీలు ఎక్కువగా ఉన్నాయని, ఇది టూరిజంపై ప్రభావం చూపుతుందని పేర్కొంటూ, చార్జీల సవరణకు టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రభుత్వానికి ప్రతిపాదించింది. పక్క రాష్ట్రాల్లో ఉన్న చార్జీలు ప్రకారం తగ్గింపు ఇవ్వాలని కోరింది. పరిశీలించిన ప్రభుత్వం లైసెన్స్ ఫీజు రూ.5 లక్షలు, రిజిస్ట్రేషన్ చార్జీలు సంవత్సరానికి రూ.20 లక్షలు చేస్తూ నిర్ణయం తీసుకుంది. మరో రెండు రోజుల్లో ఉత్తర్వులు జారీ అవుతాయని సమాచారం. కాగా నెల్లూరు నగరంలో డీఆర్ ఉత్తమ్, మినర్వా గ్రాండ్ హోటళ్ల నిర్వాహకులు బార్లకు ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతులు పొంది నిర్వహిస్తున్నారు.

సూక్ష్మపోషకాలు అందేనా ?

● భూమి సారవంతానికి అవి ఎంతో ముఖ్యం ● అధిక దిగుబడుల్లో కీలకపాత్ర ● రాయితీ కోసం ప్రభుత్వంపై అన్నదాత ఆశలు

జిల్లాలో ఎడగారు సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో వారిపై సూక్ష్మపోషక ఎరువుల భారం పడనుంది. భూముల సారవంతానికి, పంట దిగుబడులు పెంచేందుకు జింక్, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు ఎంతో ముఖ్యం. వీటిని గతంలో టీడీపీ ప్రభుత్వం రాయితీపై రైతులకు అందించేది. అయితే వైసీపీ ప్రభుత్వం మాత్రం రాయితీని పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సి రావడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అయినా వీటిని రాయితీపై అందిస్తుందన్న ఆశతో రైతులు ఉన్నారు.

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షల ఆధారంగా సూక్ష్మపోషకాల వినియోగాన్ని వ్యవసాయాధికారులు రైతులకు సూచిస్తారు. వాటిఆధారంగా ఏ రైతుకు ఏది అవసరమో గుర్తించి, దాన్ని రాయితీపై అధికారులు అందించేవారు. గత వైసీపీ ప్రభుత్వం ఈ విధానాన్ని పూర్తిగా పక్కన పెట్టడంతో రైతులపై అదనపు భారం పడింది. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో జిల్లాలో భూసార పరీక్షలకు జీవం వచ్చింది. లక్ష్యాలను నిర్దేశించడంతోపాటు నిధుల కేటాయింపులు చేసింది. దీంతో సూక్ష్మపోషకాలు కూడా రాయితీపై అందిస్తుందని రైతులు భావిస్తున్నారు.

50 నుంచి 75శాతం రాయితీ

సూక్ష్మపోషకాలలోపం కారణంగా దిగుబడులు తగ్గిపోతున్నాయని భూసార పరీక్షల ద్వారా తెలుసుకున్న టీడీపీ ప్రభుత్వం 2016లో రైతులకు 50 నుంచి 75శాతం రాయితీపై అందించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసింది. అక్కడ పేర్లు నమోదు చేసుకుని పూర్తిస్థాయిలో నగదు చెల్లించిన వారికి కంపెనీల నుంచి తెప్పించి అందిస్తామని ప్రకటించింది. ఆ తరువాత పేర్ల నమోదు కూడా ఆగింది. దీంతో రైతులు, కౌలు రైతులపై సూక్ష్మపోషకాల భారం పడింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి

జిల్లాలో ఎడగారులో దాదాపు 3.5లక్షల ఎకరాల్లో వరిసాగవుతుందని అధికారుల అంచనా. జిల్లాలోని భూముల్లో 78శాతం జింకు, 73శాతం బోరాన్, 24శాతం ఇనుము, 13.48శాతం మాంగనీసు, 21శాతం రాగి, 10శాతం సల్ఫర్ తక్కువ మోతాదులో ఉన్నట్లు భూసార పరీక్షా కేంద్రం అధికారులు చెబుతున్నారు. క్రమం తప్పకుండా జిప్సం, పచ్చిరొట్ట ఎరువులు వినియోగించాలని కూడా రైతులకు వారు సూచిస్తున్నారు. ఆయా లోపాలను నివారించేందుకు జింకు, జిప్సం, బోరాన్ వంటి సూక్ష్మపోషకాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతి ఏటా వీటిని రైతులు వినియోగిస్తుంటారు. దుక్కిదున్నే సమయంలో భూసార పరీక్ష ఫలితాల ద్వారా ఎంతశాతం జింకు లోపం ఉందో గుర్తించి వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తారు. జింకు లోపం కారణంగా ఆకుల మధ్య భాగం పసుపు రంగులోకి మారి మొక్కలు గిడసబారిపోతాయి. దీనివల్ల దిగుబడులు గణనీయంగా తగ్గిపోతాయి. చౌడు భూముల్లో సోడియాన్ని తగ్గించేందుకు జిప్సం ఉపయోగపడుతుంది. ఇందులో కాల్షియం, గంధకం ధాతువులుంటాయి. ఇక బోరాన్ పూత దశలో ఎంతో కీలకం. ఆకుల్లో తయారయ్యే ఆహారాన్ని అన్ని భాగాలకు ఇది అందిస్తుంది. దీన్ని వేయకపోతే ఉద్యాన పంటల్లో కాయలు పగిలిపోతాయి.


జిప్సం


జింకు లోపంతో పసుపు రంగుకు మారిన వరిపైరు (ఫైల్)

ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు

రాయితీపై సూక్ష్మపోషకాల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. రైతులు కోరితే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటిని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం.

- పీ.సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారి

సమాచారమిచ్చినా స్పందించని ఇరిగేషన్ అధికారులు

రాజుపాలెం చెరువు నుంచి
గ్రావెల్ దోచేస్తున్నారు

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుపాలెం పెద్ద చెరువు నుంచి రాత్రిళ్లు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రాజుపాలెంకు చెందిన అధికార పార్టీ నాయకుడొకరు, ఉలవపాడుకు చెందిన కొందరితో ఒప్పందం కుదుర్చుకుని సుమారు 300 ట్రాక్టర్ల గ్రావెల్ తోలకానికి సిద్ధపడ్డారని వారు పేర్కొన్నారు. ఉలవపాడులోని వరిగచేను ఎస్టీ కాలనీ వెనుక బైపాస్‌కు ఆనుకొని ఖాళీ స్థలంలో ప్లాట్లు వేసేందుకు గ్రావెల్‌తో చదును చేస్తున్నారు. సుమారు 4 అడుగుల మేర తోలేందుకు ట్రాక్టర్ గ్రావెల్ రూ.1000 లెక్కన రాజుపాలెం పెద్ద చెరువులో నుంచి తోలేందుకు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో మాట్లాడుకున్నట్లు సమాచారం. ఆదివారం కావడంతో అధికారులు కూడా స్పందించరనే కారణంతో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి గ్రావెల్ తోలుతున్నారు. ఈ విషయమై కందుకూరు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదని స్థానికులు పేర్కొన్నారు. ఇదే విషయమై ఇరిగేషన్ డీఈ హజరత్తయ్యకు ఫోన్ చేయగా స్పందించలేదు. ఏఈ సీతారామయ్య స్పందిస్తూ.. 'అవునా... ఇంకా తోలుతున్నారా... కనుక్కుంటాను'.. అంటూ దాటవేసే ధోరణిలో మాట్లాడటం అనుమానాలకు తావిస్తోంది.

హెచ్ఎం రామలక్ష్మమ్మకు సేవా పురస్కారం

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనార్దన కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేసి ఉద్యోగ విరమణ చేస్తున్న గుంటక రామలక్ష్మమ్మను ఆదివారం శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి సేవా పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, చక్కా వెంకటకేశవరావు, గుర్రం అల్లూరయ్య, కోట వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జాబ్‌మేళా

● సద్వినియోగం చేసుకోండి : ఇంటూరి

కందుకూరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని టీఆర్ఆర్ కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో సోమవారం ఉదయం నిర్వహించే మెగా జాబ్ మేళాను కందుకూరు నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతీ యువకులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో విజ్ఞప్తిచేశారు. పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు విద్యార్హతలు కలిగిన నిరుద్యోగులంతా ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని అర్హులైన 11, అనేక ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని ఉద్యోగులను ఎంపిక చేసుకోనున్నందున నిరుద్యోగులంతా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన సూచించారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు గ్రంథపాలకుడు దాసరి కోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి పాఠశాల విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్ క్లాస్ తదితర అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు.

నేడు విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రాక

ఉలవపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మన్నేటికోట, బద్దిపూడి గ్రామాల్లో పర్యటించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు మన్నేటికోట గ్రామంలో ఉదయం 10గంటలకు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు భూమి పూజ, అనంతరం బద్దిపూడిలో ఓవర్‌హెడ్ వాటర్‌ట్యాంక్, సీసీ రోడ్లు ప్రారంభిస్తున్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

రాష్ట్రానికి చంద్రబాబు.. బ్రాండ్

● అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు కృషి : వీపీఆర్ ● టీడీపీ, జనసేన, బీజేపీల ఆత్మీయ సమావేశం

కావలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని ఆయన ఆధ్వర్యంలో మనమంతా అభివృద్ధికి పాటుపడదామని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన జనసేన, బీజేపీ నేతల ఆత్మీయసమావేశంలో ఆయన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి పాల్గొని మాట్లాడారు. కూటమి ఏర్పడుదలను చూసి బేధాభిప్రాయాలు తేవటానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అందరం కలిసి ఉంటే ఎవరూ మనల్ని ఏమీ చేయలేరన్నారు. ఏమైనా సమస్యలుంటే నా దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే దగుమాటి మాట్లాడారు. కావలి అభివృద్ధికి ఎంపీ వేమిరెడ్డి అందిస్తున్న సహకారం మరువలేనిదని కొనియాడారు. అలాగే ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడారు. గత వైఎస్ఆర్ వైసీపీ పాలనలో నియోజకవర్గంలో కూల్చివేతలు, కేసులతో కొనసాగించిందని వాపోయారు. గత వైసీపీ కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి అరాచకాలను తట్టుకోలేక కావలిలో అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు ఏకమై ఎన్నికల్లో పనిచేశారని తెలిపారు. సమావేశంలో నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి, కావలి బీజేపీ నేతలు కందుకూరి సత్యనారాయణ, సీపీసీ సత్యం, జనసేన కావలి ఇన్‌చార్జి ఆళహరి సుధాకర్, టీడీపీ నేతలు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, మలిశెట్టి వెంకటేశ్వర్లు, పోతుగంటి అలేఖ్య, పమిడి రవికుమార్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నుడా చైర్మన్‌ను సత్కరిస్తున్న అభిమానులు

'ఇండియాలో ఇప్పుడేం చేయాలి' పుస్తకావిష్కరణ

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఐడెంటిటీ, అలయెన్స్ దిశగా దళిత బహుజనులు ముందుకు సాగాలని వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు యస్‌జే విద్యాసాగర్ కోరారు. సాధు మల్యాద్రి రచించిన ఇండియాలో ఇప్పుడేం చేయాలి పుస్తకావిష్కరణ కార్యక్రమం పట్టణంలోని స్వర్ణప్యాలెస్ కన్వెన్షన్ హాలులో ఆదివారం సాయంత్రం జరిగింది. బీఎస్పీ నాయకుడు కె మోహనరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అబ్దుల్ నూర్‌బాషా, బీ లక్ష్మీనరసయ్య, వీసీకే పార్టీ అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడారు. వివిధ దళిత సంఘాల నాయకులు బద్దిపూడి జయరావు, ఎం బుడ్డకోటి, చార్వాక, బ్రహ్మయ్య పాల్గొన్నారు.



పుస్తకావిష్కరణలో దళితసంఘాల ప్రతినిధులు

ఉపాధి కూలీలకు బీమా సౌకర్యం

కొండాపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం కూలీలకు ప్రభుత్వం రెండు రకాల బీమా సౌకర్యం కల్పించనుందని ఎంపీడీవో ఆదినారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవనజ్యోతి పథకం కింద పోస్టల్ ఖాతా ఉన్న 18- 70ఏళ్ల నిండిన వారు అర్హులన్నారు. వివరాలకు గ్రామ క్షేత్ర సహాయకులను సంప్రదించాలన్నారు.

వంతెన గోడలోని చెట్ల తొలగింపు

కావలి, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉదయగిరి రోడ్డులో ఉన్న ఆర్వోబీ వంతెన గోడలో ఉన్న వృక్షాలను అధికారులు తొలగించారు. వంతెన గోడల్లో వృక్షాలు.. పగుళ్లిస్తున్న నిర్మాణాలు, పట్టించుకోని అధికారులు అనే శీర్షికతో ఈ నెల 23న ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు వెంటనే వంతెన గోడలో ఉన్న వృక్షాలను తొలగించారు. అంత వరకు బాగానే ఉన్నా వృక్షాలను మొదళ్ల వరకు మాత్రమే తొలగించారు. వాస్తవంగా వాటి వేర్లను సైతం తొలగించి అక్కడ యాసిడ్ వేస్తే భవిష్యత్తులో మళ్లీ అక్కడ వృక్షం పెరగకుండా ఉండేందుకు అవకాశం ఉంది. కానీ అధికారులు ఆ పని చేయలేదు. దీంతో ఆ వృక్షాలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.



యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి

● అధికారులకు తల్లిదండ్రుల మొర

లింగసముద్రం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెంట్రాల యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని మాజీ సర్పంచ్, టీడీపీ నాయకుడు కిలారి కొండయ్య విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ స్థులు ఆదివారం అధికారులను ఒక ప్రకటనలో కోరారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తెచ్చిన మార్పుల్లో భాగంగా తమ యూపీ పాఠశాలను మోడల్ ప్రైమరీ పాఠశాలగా మార్పు చేయాలని అధికారులు నిర్ణయించారని, ఈ నిర్ణయం వలన పాఠశాలలో చదివే 6,7,8 తరగతుల విద్యార్థులు 4 కి.మీ దూరంలో ఉన్న లింగసముద్రంలోని జడ్పీ హైస్కూల్‌కు వెళ్లాల్సి వస్తుందన్నారు. అయితే తమ యూపీ పాఠశాలను హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేస్తే, తమ పాఠశాలకు రెండు మూడు కి.మీ దూరంలోని చీమలపెంట, రాళ్లపాడు, జంపాలవారిపాలెం, వాణిమ్మవారిపాలెం, గొల్లపాలెం గ్రామాలకు చెందిన విద్యార్థుల తమ పాఠశాలలో చేరే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని మండల విద్యా శాఖ అధికారులకు వివరించినా వారు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పాఠశాలలో 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు 77 మంది 6 నుండి 8 తరగతుల వరకు 61 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఇటీవల ప్రభుత్వం 51, 52, 53 ఉండి విద్యార్థులున్న యూపీ పాఠశాలలను సైతం హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేసి తమ యూపీ పాఠశాలను అప్‌గ్రేడ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ పాఠశాలను కూడా హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

దివ్యాంగులకు ఎలక్ట్రికల్ ట్రై సైకిళ్ల పంపిణీ

కావలి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకే వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా నెల్లూరు పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఉచితంగా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్నట్లు నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక మినీస్టేడియంలో నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన 155మంది దివ్యాంగులకు ఉచితంగా ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, జనసేన నేత ఆళహరి సుధాకర్, బీజేపీ నేత కందుకూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదుల దాడులు.. ప్రభుత్వ భద్రతా వైఫల్యమే !

చిట్టగుంట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడులు ప్రభుత్వ భద్రతా వైఫల్యం కారణం అని సీపీఎం సీనియర్ నేత తుమ్మల వెంకయ్య ఆరోపించారు. ఈ విషయంపై ఆదివారం ఉదయం బోగోలు మండల సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా పెహల్గాంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పర్యాటకుల కేంద్రంలో ప్రభుత్వం భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గద్దం మాల్యాద్రి, ఎస్ రమయ్య, సీఐటీయు మండల కార్యదర్శి చల్లా నరహరి, షేక్‌బాదుల్లా, షేక్ అన్వర్ బాషా, రైతు సంఘం నాయకులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు తుమ్మల వెంకయ్య

నేడు ముస్లిం‌ల ర్యాలీ

కందుకూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సోమవారం సాయంత్రం కందుకూరులో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. మక్కా మసీదు నుంచి పోస్టాఫీసు సెంటర్ వరకు కొవ్వొత్తులతో నిర్వహించే ర్యాలీలో ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులంతా పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఈతకు వెళ్లే పిల్లలపై అప్రమత్తంగా ఉండాలి : ఎస్ఐ

జలదంకి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేసవిసెలవుల నేపథ్యంలో పిల్లలు ఈత నేర్చుకోవడానికి చెరువులు, కాలువలు, బావులు, వాగులు, గుంటల్లోకి వెళుతుంటారని వారి పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని మండల ఎస్ఐ నయ్యద్ లతీఫున్నీసా సూచించారు. విద్యార్థులకు వేసవిసెలవులు నేపథ్యంలో ఆదివారం మండలంలోని పలు చెరువులు, నీటివనరులను పరిశీలించి ప్రమాదసూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలకు ఈత నేర్పించాలనుకుంటే తల్లిదండ్రులు దగ్గరుండి నేర్పించాలన్నారు. నీటివనరుల పరిశీలనలో ఎస్ఐ వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

జనసేన కలిగిరి మండల అధ్యక్షుడి అరెస్టు

కలిగిరి, (ఆంధ్రజ్యోతి): తల్లిపై దాడి, హత్యాయత్నం కేసులో జనసేన మండలాధ్యక్షుడు బందారు లక్ష్మీ నారాయణను ఆదివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ ఉమాశంకర్ తెలిపారు. వివరాల మేరకు.. శుక్రవారం రాత్రి తండ్రీకొడుకులపై ఆకారం గా కర్రతో దాడి చేసిన ఘటనలో జిర్రావారిపాలెం గ్రామస్థులు అర్ధరాత్రి వరకు ప్రధాన రహదారిపై బైఠాయించి న్యాయం చేయాలని డిమాండు చేశారు. అంతకు ముందు నిందితుడి తల్లి వనమ్మపై కూడా దాడి చేసినట్టు ఫిర్యాదు అందింది. ప్రస్తుతం నిందితుడిని తల్లిపై దాడి కేసులో అరెస్టు చేశామని, గ్రామంలోని తండ్రీ కొడుకులపై దాడి కేసులో మరోసారి అరెస్టు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

ఉచిత ఖత్నా శిబిరం

కావలిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సలఫీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో ఉచిత ఒడుగుల (ఖత్నా) శిబిరం నిర్వహించారు. ట్రస్ట్ బాధ్యులు పఠాన్ ఇర్ఫాన్, షేక్ ఇర్ఫాన్‌ల పర్యవేక్షణలో జరిగిన శిబిరంలో 40మంది పిల్లలకు ఖత్నా చేయించారు. కార్యక్రమంలో అహలే హదీస్ పట్టణ కార్యదర్శి షేక్ జమీర్, ఉపాధ్యక్షులు అబుసులేమాన్, ఎస్‌కె బాబు, మస్తాన్‌వలి, ఎస్‌కె రిజ్వాన్, అమ్జద్‌ఖాన్ పాల్గొన్నారు.

వినియోగదారుల విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణ

● ట్రాన్స్‌కో ఏఈ మన్మధరావు



సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని, దీన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్‌కో ఏఈ మన్మధరావు తెలిపారు.

? అదనపు లోడు అంటే ఏమిటీ, డెవలప్‌మెంట్ ఛార్జీలు ఎంత, ఇప్పుడు ఎంత రాయితీ ఇస్తున్నారు.

! వినియోగదారులు గతంలో అనుమతి మేరకు సర్వీస్ తీసుకుని సమయంలో ఒక కిలోవాట్‌కు తీసుకుని ఉండవచ్చు. కిలోవాట్ కంటే ఎక్కువ వినియోగిస్తుంటే అదనపు లోడు అంటారు.

ఈ ఇంటర్వ్యూ

? 50 శాతం రాయితీ అంటే ఎంత మొత్తం.

! గతంలో ఒక కిలోవాట్‌కు డెవలప్‌మెంట్ ఛార్జీలు రూ. 2వేలు. ప్రస్తుతం వినియోగదారులు స్వయంగా క్రమబద్ధీకరించుకుంటే కిలోవాట్‌కు రూ. 1000 చెల్లిస్తే సరిపోతుంది. లేకపోతే విద్యుత్ అధికారులు తనిఖీ సమయంలో అదనపు లోడు వినియోగిస్తున్నట్లు తెలిస్తే పూర్తి మొత్తంతో పాటు జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

? క్రమబద్ధీకరణ ఎలా చేసుకోవాలి.

! వినియోగదారులు గూగుల్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్ ఓపెన్ చేయగానే వాలంటరీ అడిషనల్ లోడ్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి అదనపు లోడ్‌ను కిలోవాట్‌కు రూ. 1000 చొప్పున ఎన్ని కిలోవాట్‌లు కావాలంటే అన్నింటికి చెల్లించవచ్చు.

? క్రమబద్ధీకరణకు ఎప్పటి వరకు అవకాశం ఉంది.

! క్రమబద్ధీకరణకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఇచ్చారు.

నేటి నుంచి వేసవి శిక్షణ తరగతులు

అనంతసాగరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు విద్యార్థులకు ప్రత్యేక వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు గ్రంథపాలకుడు డి నారాయణరావు తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటలకు వరకు తరగతులు ఉంటాయని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు

● మొక్కుబడిగా స్వచ్ఛ కార్యక్రమాలు
● పట్టించుకోని అధికారులు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్, పాలిథిన్ సంచుల నిషేధం అమల్లో ఉన్నా అధికారుల ఉదాసీనత వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోంది. నిషేధాలు హెచ్చరిస్తున్నారు. పట్టణాలతో సహ పల్లెల్లోను పాలిథిన్ వస్తువుల వినియోగం రోజు రోజుకు పెరుగుతోంది. ఇవి భూమిలో కరగిపోవడంతో భూసారం దెబ్బ తినడం, భూగర్భ జలమట్టం అడుగంటడం జరుగుతోంది. మరుగు కాలువల్లో పాలిథిన్ సంచులు, గ్లాసులు చేరడంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలిగి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా పాలిథిన్ సంచుల్లో తీసుకెళ్లే ఆహార పదార్థాలు ఆనారోగ్యానికి కారణమవుతున్నాయి. పాలిథిన్ సంచులు చెత్తలో వేయడం వల్ల వాటిని తినే ఆవులు, గేదెలు, మూగజీవాలు వ్యాధుల బారిన పడుతున్నాయి. ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ఎన్ని చట్టాలు చేసినా సంబంధిత శాఖలు చోద్యం చూస్తున్నాయే తప్ప వాటిని అమలు పర్చడంలో వెనకడుగు వేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



గండిపాళెం పంట కాలువలో పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నీరుగారుతున్న లక్ష్యం

ప్రభుత్వాలు ప్లాస్టిక్ నిషేధం అమలులో భాగంగా అనేక స్వచ్ఛ కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేక ప్రత్యేక కార్యక్రమాల రోజుల్లో హడావిడి చేసే అధికారులు మొక్కు బడి కార్యక్రమాలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతోంది. ప్రధాన కూడళ్లు, దుకాణాల సమీప దారులు, నివాసాల నుంచి సేకరించే చెత్తలోను ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా కన్పిస్తుండడం దారుణం. అంతేగాక హోటళ్లు, దాబాలు, కూరగాయలు, పండ్లు, జ్యూస్, కిరాణా, చికెన్ తదితర దుకాణాల్లో వినియోగిస్తున్నప్పటికీ అడ్డుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ప్లాస్టిక్ వినియోగంపై చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఉగ్రవాదుల దాడికి నిరసనగా ర్యాలీ

సీతారామపురం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన భారతమాత బిడ్డలకు మన నివాళులర్పిస్తూ ఉగ్రవాదుల దాడికి నిరసనగా మండల టీడీపీ ఇన్‌చార్జ్ చింతల శ్రీనివాసులు, చింతల కామేశం ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మండల పరిషత్ కార్యాలయం వరకు కొవ్వొత్తులతో వెలిగించి మౌనంగా ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల నాయకుడు చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ ఉగ్రవాదుల చర్యలను ఖండించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చెన్నకేశవులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, డాక్టర్ ఎలిషా కుమార్, జాషువా, జనసేన నాయకులు భోగినేని కారిక్తయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, వార్డుమెంబర్ తోట మనోజ్ బాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బస్టాండ్ సెంటర్‌లో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కూటమి నాయకులు

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు



నాగారపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహిళలు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ పూజల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఉచిత చిత్రకళా శిక్షణ

ఉదయగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్వీఎస్ డీపో కండక్టర్, చిత్ర కళాకారుడు సుదర్శన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి ఉచిత చిత్రకళా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తరగతుల నిర్వహణ ఈనెల 30న స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశానికి వచ్చిన విద్యార్థులను కేటగిరీలుగా విభజించి వారికి అనుకూలంగా తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శివారు ప్రాంతాల్లో జోరుగా గంజాయి విక్రయాలు

● పెడదారి పడుతున్న యువత

వింజమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివారు ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేడని స్థానికులు విమర్శిస్తున్నారు. వింజమూరు పట్టణం విద్యాపరంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో గంజాయి విక్రయాల వలన యువత పెడదారి పడుతోందని, పట్టణ శివారు ప్రాంతాల్లో ఈ గంజాయి దందా జరుగుతోందని ఆటు వెళ్లాన్న బాటసారులు తెలిపారు. నిత్యం జగన్న లేఅవుట్లలోని కాలనీలో గంజాయి సేవిస్తూ గొడవలు పడుతున్నారని తెలిపారు. అలాగే పట్టణంలో క్రికెట్ బెట్టింగులు కూడా సాగుతున్నాయని, వీటివలన కొన్ని కుటుంబాలు నాశనం అయ్యాయని, కానీ ఎవరూ పట్టించుకోకపోవడం వలన ఈ దందాలు కొనసాగుతున్నాయన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి విక్రయాలు, క్రికెట్ బెట్టింగులు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

గంగమ్మకు పూజలు

ఉదయగిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. ఈసందర్భంగా భక్తులు బుట్టల్లో పొంగలి సామగ్రితో బాణసంచా పేలుళ్లు నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ఆల యానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో పొంగళ్లు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, ఆలయ చైర్మన్ పాములు రమణయ్య అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.



అమ్మవారి పూజల్లో పాల్గొన్న భక్తులు

ప్రతిఒక్కరూ సజ్జన సాంగత్యం అలవర్చుకోవాలి

వింజమూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సజ్జన సాంగత్యం అలవర్చుకోవాలని గూడూరు సీనియర్ పిరమిడ్ మాస్టర్ లావణ్యలత సూచించారు. స్థానిక శ్రీవేద వ్యాస పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాస్టర్‌ని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో హేమలత, రాజేశ్వరి, స్వరాజ్యం, ఉమ, నీత, లక్ష్మీ, నాగరత్నమ్మ, తదితర ధ్యానులు పాల్గొన్నారు.

వేరుశనగ కట్టెకు డిమాండ్

● రైతుల్లో ఆనందం

సంగం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ కట్టెకు డిమాండ్ ఏర్పడింది. ఎకరా పొలంలో కట్టె సుమారు రూ. 5వేలు పలుకుతోంది. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. మండలంలోని పడమటిపాళెం, పల్లిపాళెం, అనసూయనగర్ తదితర ప్రాంతాల్లో పెన్నానది ఒడ్డున ఇసుక నేలల్లో విరివిగా వేరుశనగ సాగు చేస్తారు. ఇసుక నేలల్లో వేరే పంట పండదు. దీంతో ఏటా రెండు సార్లు పంట సాగు చేస్తారు. పంట కోసిన తరువాత ఈ కట్టెను పశువులకు మేతగా వినియోగిస్తారు. ఈ కట్టె తిన్న పాడి పశువులు పాలు బాగా ఇస్తాయి. దీంతో కలిగిరి వింజమూరు తదితర ప్రాంతాల పాడి రైతులు ఎక్కువగా కొనుగోలు చేస్తుండటంతో మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో పంట సాగు చేసే రైతులకు ఎకరాకు ఐదు వేల చొప్పున అదనపు ఆదాయం పెరిగినట్లయింది. ఈ ఆదాయం పొలం దుక్కులకు సరిపోతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న వేరుశనగ కట్టె

జాతీయ రహదారిపై దెబ్బతిన్న బారికేడ్లు

● ప్రమాదాల బారిన వాహనదారులు

మర్రిపాడు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మర్రిపాడు బస్టాండ్ సెంటర్‌లో నెల్లూరు-ముంబయి జాతీయ రహదారిపై బారికేడ్లు దెబ్బతినడంతో ప్రమాదాలకు గురికావాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. గతంలో డివైడర్‌పై ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేయడంతో మండలంలో ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయనందున డివైడర్‌పై వాహనాలు దూసుకెళ్లడంతో బారికేడ్లు ఒక్కొక్కటిగా విరిగిపోయాయి. తిరిగి వాటిని ఏర్పాటుచేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం డివైడర్ పైకి లారీలు, కార్లు దూసుకెళ్లి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి బారికేడ్లు ఏర్పాటుచేసి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.



బారికేడ్లు లేక ప్రమాదకరంగా ఉన్న డివైడర్